ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 188
గురువారం 16 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ‘అభయ’ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనిత

మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్న అనిత
చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని సూచన
బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిల్లలకు హితవు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు చాలా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రజలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై ఓ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో ‘అభయ’ కార్యక్రమాన్ని హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ‘అభయ’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ‘మహిళల భద్రత – మా బాధ్యత’ అంటూ అనకాపల్లి పోలీసులు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఎన్నో పోరాటాల వలన మహిళలకు స్వేచ్ఛ వచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు ధైర్యం కల్పించడానికి ‘అభయ’ కార్యక్రమాన్ని పోలీసులు ప్రారంభించారని తెలిపారు. చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలని మంత్రి అనిత అభిప్రాయపడ్డారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. పిల్లలను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని... కష్టపడి చదువుకొని, ఉన్నత స్థాయికి వెళ్ళాలని ఈ సందర్భంగా పిల్లలకు ఆమె సూచించారు.
ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని అనిత సూచించారు. ఎవరైనా మిమ్మల్ని ఇబ్బంది పెడితే తక్షణమే 112కి కాల్ చేయాలని అన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని వివరించారు. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకండి అంటూ పిల్లలకు హితవు పలికారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో కూడా అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన ‘జలహారతి’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. “వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలాడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను” అని సంచలన వ్యాఖ్యలు చేశారు.
2019–24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును ‘వట్టిసీమ’, ‘దండగ’ అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. “నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం” అని చంద్రబాబు స్పష్టం చేశారు.

▶మిగతా 2లో

## అమల్లోకి భారత్-యూకే ట్రేడ్ డీల్..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 15)
భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఒప్పందంతో ప్రపంచంలోని అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటైన యూకేలో భారత ఎగుమతిదారులకు అపారమైన అవకాశాలు లభించనున్నాయి. అదే సమయంలో పలు ప్రీమియం బ్రిటిష్ ఉత్పత్తులు భారత కొనుగోలుదారులకు తక్కువ ధరలకే అందుబాటులోకి రానున్నాయి. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగ కల్పనను ప్రోత్సహించి, భారత తయారీ, సేవా రంగాలకు కొత్త ఊపునిస్తుందని వాణిజ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**భారత ఎగుమతిదారులకే అతిపెద్ద ప్రయోజనం**

ఈ ఒప్పందంలో సింహభాగం ప్రయోజనం భారత ఎగుమతిదారులకే దక్కనుంది. యూకేకు భారత్ చేసే ఎగుమతుల్లో దాదాపు 99 శాతం వస్తువులపై ఇకపై సుంకాలు ఉండవు. అంటే.. ఇప్పటివరకు బ్రిటన్‌లో దిగుమతి సుంకాలతో సతమతమైన వేలాది భారత ▶మిగతా 2లో

## తపాలా చరిత్రలో రికార్డు

తొలి త్రైమాసికంలో రూ.4 వేల కోట్లు దాటిన ఆదాయం
102% లక్ష్యాన్ని సాధించి అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్
కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన సమీక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
భారత తపాలా విభాగం చరిత్రలో అపూర్వఘట్టం ఆవిష్కారమైందని కేంద్ర కమ్యూనికేషన్లశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కేబినెట్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి ఈ శాఖ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి తీసుకున్న నిర్మాణాత్మక చర్యల కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఇండియా పోస్ట్ ఆదాయం రూ.4 వేల కోట్లను ▶మిగతా 2లో



## చంద్రబాబు సానుభూతిపరులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు: జగన్

భీమవరంలో ఆక్వా రైతులతో జగన్ ముఖాముఖి
ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని విమర్శ
చంద్రబాబు ప్రతి అడుగు మోసమేనని మండిపాటు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో ఉందని, ఆక్వా రైతులు దీనావస్థలో ఉన్నారని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి ▶2లో

## కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ విస్తరణ.. శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
రాయలసీమ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక ముందడుగు పడింది. కడప జిల్లాలో ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ దాల్మియా భారత్ సిమెంట్ తన కార్యకలాపాలను భారీ స్థాయిలో విస్తరించనుంది. జిల్లాలోని మైలవరం మండలం చిన్నకొమెర్ల వద్ద రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న రెండో ప్లాంట్ (లైన్-2) విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ విస్తరణ ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభించనుండటంతో స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.




ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. శంకుస్థాపనకు ముందు మంత్రి, కంపెనీ ప్రాంగణంలోని అడ్మినిస్ట్రేషన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆధునిక రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. వాటి పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను, ఆడియో విజువల్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా అక్కడి కార్మికులతో కాసేపు ముచ్చటించి, ▶మిగతా 2లో

## జగన్‌ది రాక్షస మనస్తత్వం: నిమ్మల రామానాయుడు

జగన్ రైతు ద్రోహి అన్న మంత్రి నిమ్మల
ఎల్‌నినో కారణంగా నీరు లేని పరిస్థితి నెలకొందని వెల్లడి
రైతన్నలకు పట్టిసీమ ప్రాణం పోస్తోందని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
వైసీపీ అధినేత జగన్‌పై ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాక్షస మనస్తత్వం జగన్‌దని ధ్వజమెత్తారు. కరవు కాటకాలతో రాష్ట్రం అల్లాడిపోవాలనే ఆలోచన ఆయనదని విమర్శించారు. రైతు ద్రోహి జగన్ అని, అలాంటి వ్యక్తికి ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉండే అర్హత కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో కారణంగా ఏపీలో ఎక్కడా ఒక్క చుక్క నీరు కూడా లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల్లో నీళ్లు లేని పరిస్థితి ఉందన్నారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే ఈరోజు రైతన్నలకు పట్టిసీమ ప్రాణం పోస్తోందని చెప్పారు. ▶మిగతా 2లో

## కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు

పవిత్ర సంగమం వద్ద కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి
రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని పవిత్ర కృష్ణా-గోదావరి నదీ సంగమం వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని ఆకాంక్షిస్తూ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ▶మిగతా 2లో

## ప్రభుత్వాలను ఎదిరించి నిలిచిన ధీశాలి ముద్రగడ: వెల్లంపల్లి

ప్రభుత్వాలను ఎదిరించి నిలిచిన ధీశాలి ముద్రగడ: వెల్లంపల్లి
విజయవాడలో ముద్రగడ సంతాప సభ
ఎక్కడా లొంగిపోని మనస్తత్వం ముద్రగడదన్న వెల్లంపల్లి
ముద్రగడకు జరిగిన అన్యాయంపై పవన్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 15)
మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతిపై విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా సేవలందించిన గొప్ప నేత ▶2లో

మొదటిపేజీ తరువాయి

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు."రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# అమల్లోకి భారత్-యూకే ట్రేడ్ డీల్..

ఉత్పత్తులు ఇకపై సుంకాలు లేని ప్రవేశంతో యూరోప్, చైనా వంటి దేశాల ఉత్పత్తులకు గట్టి పోటీ ఇవ్వనున్నాయి. ముఖ్యంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కార్మిక-ఆధారిత రంగాలకు ఈ ఒప్పందం ఒక వరంలా మారనుంది. వస్త్రాలు, దుస్తులు, తోలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, ప్రాసెస్డ్ ఫుడ్, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ ఉత్పత్తుల రంగాలకు భారీ ప్రోత్సాహం లభిస్తుంది. సుంకాల తొలగింపుతో లాభాల మార్జిన్లు పెరిగి, ఉత్పత్తి పెరిగి, తయారీ కేంద్రాల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.ఈ ఒప్పందంపై వయనా ప్రెసిడెంట్ కౌశల్ సంపత్ ఎన్డీటీవీతో మాట్లాడుతూ.. "భారత్-యూకే ఒప్పందం భారత ప్రపంచ వాణిజ్య ప్రయాణంలో ఒక కీలక మైలురాయి. ఇప్పటికే యూకే భారత ఐదో అతిపెద్ద ఎగుమతి గమ్యస్థానంగా ఉన్నప్పటికీ, మన దిగుమతుల్లో దాని వాటా కేవలం 1 శాతమే. ఇది సమతుల్య వాణిజ్యానికి ఇంకా చాలా అవకాశాలు ఉన్నాయని సూచిస్తోంది. ఈ ఒప్పందం ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు కొత్త అవకాశాలను అందిస్తుంది" అని వివరించారు.

సేవా రంగానికి నూతన ఉత్తేజం

ఈ ఒప్పందం కేవలం వస్తువులకే పరిమితం కాలేదు. భారత ఐటీ కంపెనీలు, కన్సల్టింగ్ సంస్థలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, అకౌంటెంట్లు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విద్యా సేవా ప్రదాతలకు యూకే మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం కానుంది. ఈ ఒప్పందంలో 137 సేవా ఉప-రంగాలు ఉన్నాయి. అంతేకాకుండా, 'డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ (ఐజజ)' అనే నిబంధన భారత నిపుణులకు ఎంతో మేలు చేయనుంది. దీని ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేసే భారత ఉద్యోగులు ఐదేళ్ల వరకు రెండు దేశాల్లోనూ సామాజిక భద్రతా చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు.

# తపాలా చరిత్రలో రికార్డు

దాటినట్లు చెప్పారు. మంగళవారం ఇక్కడి విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన ఇండియాపోస్ట్ 2026-27 వార్షిక వ్యాపార త్రైమాసిక సమీక్షలో ఆయన పాల్గొన్నారు. "ఇండియాపోస్ట్‌కు 2026-27లో రూ.19,803 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని ఖరారు చేశాం. అందులో తొలిత్రైమాసికంలో రూ.4,950 కోట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.4,008 కోట్లు సాధించాం. ఇది గత ఏడాది ఇదే సమయంలో సాధించిన ఆదాయం కంటే 22% ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌కు తొలి త్రైమాసికంలో రూ.229.93 కోట్లు సాధించాలని నిర్దేశించాం. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో రూ.233.56 కోట్ల ఆదాయం సాధించి 102% లక్ష్యాన్ని చేరుకొంది. తెలంగాణకు తొలిత్రైమాసికంలో రూ.224.13 కోట్లు సాధించాలని నిర్దేశించాం. అక్కడ రూ.157.78 కోట్లు వచ్చింది. ఈ ఆదాయార్జన లక్ష్యసాధన విషయంలో ఏపీ తొలిస్థానంలో నిలవగా, తెలంగాణ 22వ స్థానంలో నిలిచింది" అని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు.

# చంద్రబాబు సానుభూతిపరులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు: జగన్

సమావేశం నిర్వహించిన జగన్... ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలకు హేతుబద్ధత ఉండాలని, ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. దున్నపోతు మీద వాన పడినట్టు ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు.

ఆక్వా రంగం ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని జగన్ తెలిపారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీడ్, సీడ్ రేట్లు చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని, చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఫీడ్ రేట్లు కేజీకి రూ.14 నుంచి 16కి ఎడాపెడా పెంచేశారని, ముష్టి వేసినట్టు కేజీకి రూ.2 తగ్గిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రేట్లు పెంచితే పెంచేస్తారని... రేట్లు తగ్గితే తగ్గించరా అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం 'అప్సడా' ఏర్పాటు చేశామని... సీడ్, ఫీడ్, మార్కెటింగ్‌లో సమస్యలు వస్తే పరిష్కరించామని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక 'అప్సడా'ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నామని, రొయ్యలకు మద్దతు ధర తగ్గకుండా మానిటర్ చేశామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర తగ్గకూడదని చట్టం చేశామన్నారు. ఈరోజు కేజీ కౌంట్ రూ.230లు దాటని పరిస్థితి ఉందని చెప్పారు.

ఆక్వా రైతులకు తాము 1.50కే యూనిట్ విద్యుత్ అందించామని, ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.401 కోట్ల సబ్సిడీ బకాయిలు చెల్లించామన్నారు. చంద్రబాబు ప్రతి అడుగు మోసమని విమర్శించారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

# కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ విస్తరణ.. శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

వారితో కలిసి సెల్ఫీ దిగారు. ఆ తర్వాత పునీత్ దాల్మియాతో కలిసి భూమిపూజ నిర్వహించి, ప్లాంట్ విస్తరణ పనులకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఉత్పత్తి సామర్థ్యం మూడింతలు పెంపు

దాల్మియా సిమెంట్ ప్రస్తుతం చిన్నకొమెర్లలోని ప్లాంటులో ఏటా 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. తాజాగా చేపట్టిన రెండో లైన్ విస్తరణ పూర్తయితే ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. క్లింకర్ ఉత్పత్తి 6.1 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ఇది ప్రస్తుత సామర్థ్యంతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అధికం. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 1000 మందికి, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ సీహెచ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ గణేశ్ వామనరావు, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్ తదితరులు హాజరయ్యారు. ఈ భారీ పెట్టుబడితో కడప జిల్లా పారిశ్రామిక రంగంలో మరింత బలోపేతం కానుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి పట్టిన సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జలవనరులే అభివృద్ధికి మూలమని స్పష్టం చేశారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి, రాష్ట్రాన్ని కరవు రహితంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గోదావరి మిగులు జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి రాయలసీమ, కృష్ణా డెల్టాకు ప్రయోజనం చేకూర్చిన పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆయన కొనియాడారు. గతంలో ఈ ప్రాజెక్టుపై వచ్చిన విమర్శలను తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ వాటిని తిప్పికొట్టారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎంపీ కేశినేని చిన్ని, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

# ప్రభుత్వాలను ఎదిరించి నిలిచిన ధీశాలి ముద్రగడ: వెల్లంపల్లి

ముద్రగడని ప్రశంసించారు. ప్రభుత్వాలను ఎదిరించి నిలిచిన ధీశాలి అని, ఎక్కడా లొంగిపోని మనస్తత్వం ఆయనదని కొనియాడారు.కాపు రిజర్వేషన్ల కోసం పోరాడిన ముద్రగడపై గతంలో అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. అప్పట్లో ముద్రగడను పలకరించడానికి వచ్చిన చిరంజీవి, దాసరి నారాయణరావులను ఎయిర్‌పోర్ట్ నుంచే వెనక్కి పంపడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ముద్రగడకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ముద్రగడ పద్మనాభం ఆశయాలు, ఆలోచన విధానాన్ని వైసీపీ ముందుకు తీసుకెళుతుందని వెలంపల్లి స్పష్టం చేశారు. ఈ సంతాప సభలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ముద్రగడ మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని అందరూ వ్యాఖ్యానించారు.

# జగన్‌ది రాక్షస మనస్తత్వం నిమ్మల రామానాయుడు

కృష్ణా డెల్టాకు, రాయలసీమకు పట్టిసీమతో భద్రత కల్పించారని తెలిపారు. పోలవరం పూర్తి అయ్యేలోపు పట్టిసీమ ద్వారా నీళ్లు పంపిస్తామని చెప్పారు. పట్టిసీమను వట్టిసీమ అని మాట్లాడిన జగన్ కృష్ణానది ఒడ్డుకొచ్చి ఈరోజు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందని తెలిపారు. పట్టిసీమ కేవలం కృష్ణాడెల్టాకు మాత్రమే పరిమితం కాదని, రాయలసీమకు సైతం నీటి భద్రత కల్పించిన పథకమని వ్యాఖ్యానించారు.

# నూజెండ్ల మండలంలో పొలం పిలుస్తోంది





(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, జులై 15)

నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి అంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ముర్తిజాపురం, తంగిరాల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆముదం (కాస్టర్) పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై సమగ్రంగా అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, సరైన విత్తే సమయం, సిఫారసు చేసిన మొక్కల మధ్య దూరం, ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, సమగ్ర చీడపీడల మరియు వ్యాధుల నివారణ చర్యలు, తేమ సంరక్షణ పద్ధతులు వంటి అంశాలను రైతులకు వివరించారు.అలాగే, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటిని ఆదా చేసే సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం, వర్షపు నీటిని సంరక్షించడం, నేలలో తేమ నిల్వ ఉండేలా చర్యలు చేపట్టడం, అవసరమైన మేరకే నీటిపారుదల నిర్వహించడం వంటి జాగ్రత్తలను పాటించాలని సూచించారు.రైతులు శాస్త్రీయ వ్యవసాయ సాంకేతికతలను అనుసరించి, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను పాటించడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకుని మెరుగైన దిగుబడులు, అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి అంజనేయులు నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు దస్తావేజు లేఖర్ల వినతి

## జీఓ 396ను రద్దు చేయాలని విన్నపం

## సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తామని చీఫ్ విప్ జీవీ హామీ





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 15)

రిజిస్ట్రేషన్లశాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టాలని భావిస్తున్న (రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు) విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఇందుకు సంబంధించిన జీవో నెంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ వినుకొండ నియోజకవర్గ దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వారి సహాయకులు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులుకి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నో ఏళ్లుగా తాము రిజిస్ట్రేషన్ శాఖను నమ్ముకుని చట్టబద్ధంగా డాక్యుమెంట్లు రాస్తూ జీవనోపాధి పొందుతున్నామని, ఇప్పుడు ప్రభుత్వం తెస్తున్న నూతన విధానం వల్ల తమ ఉపాధి పూర్తిగా దెబ్బతిని వందలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని వారు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖర్ల సమస్యల పై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ జీవో 396 ద్వారా దస్తావేజు లేఖర్లకు జరుగుతున్న నష్టాన్ని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా, దస్తావేజు లేఖర్ల వృత్తికి ఎలాంటి భంగం కలగకుండా చూస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# తొలి ఏకాదశి తిరునాళ్ల ఏర్పాట్ల పై చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సమీక్ష

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 15)

ఈ నెల 25న జరగనున్న తొలి ఏకాదశి కొండ తిరునాళ్ల ఏర్పాట్లపై వినుకొండ పురపాలక సంఘ సమావేశ మందిరంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా, ఆర్డీఓ, రెవెన్యూ, పురపాలక శాఖ, పోలీసు, దేవాదాయ, వైద్య, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ తిరునాళ్లకు దాదాపు లక్ష మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, తాగునీరు, మజ్జిగ, భోజనం, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ వెలుగులు వంటి అన్ని మౌలిక వసతులను సమృద్ధిగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొండపైకి భక్తుల రాకపోకలకు ఆర్టీసీ ద్వారా 60 బస్సులను సిద్ధం చేయాలని, అవసరమైతే పొరుగు డిపోల నుంచి అదనపు బస్సులు తీసుకురావాలని, పూర్తిగా కండిషన్‌లో ఉన్న బస్సులనే నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఒక్క బస్సు కూడా మార్గమధ్యలో నిలిచిపోకుండా ముందస్తు తనిఖీలు పూర్తి చేయాలని సూచించారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను సిద్ధం చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా





వైద్య శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొండపైతో పాటు ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, అత్యవసర చికిత్స బృందాలను సిద్ధంగా ఉంచాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశించారు. అగ్నిమాపక, విద్యుత్, రెవెన్యూ, పురపాలక, దేవాదాయ, పోలీసు, ఆర్టీసీ తదితర అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి చిన్న అంశంపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, క్యూ లైన్ల నిర్వహణ, తప్పిపోయిన చిన్నారుల కోసం సహాయ కేంద్రాలు, నిరంతర మైక్ ప్రకటనలు వంటి ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేసి తొలి ఏకాదశి తిరునాళ్లను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

16.07.26 గురువారం


# బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో వేలకోట్లు దోచుకున్నారు



**ఓబులాపురంలో దోచుకున్న సొమ్ముతోనే సాక్షి పేపర్, టివి పెట్టారు**

**ఐదేళ్ల పాలనలో కడప జిల్లాకు జగన్ చేసింది శూన్యం**

**ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం**

**24న తల్లికి వందనం నిధులను జమ చేయబోతున్నాం**

**ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 15)**

జగన్మోహన్ రెడ్డి రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ, జగన్ అధికారంలో ఉండగా కడపజిల్లాకు ఒక్క పరిశ్రమను సీమకు తీసుకురాకపోగా, ఇక్కడ సంపదనంతా అడ్డగోలుగా దోచుకున్నారని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రొద్దుటూరు సమీపంలోని దొరసానిపల్లిలో నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో 11వేల ఎకరాలను రూ.18వేల చొప్పున, మరో 3వేల ఎకరాలను రూ.25వేల చొప్పున భూములు తీసుకున్నారు, యువతకు 10వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పేర్చకుండా, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశారు. ఓబులాపురం గనుల్లో విచ్చలవిడిగా ఐరన్ ఓర్ తవ్వేసి రెడ్ గోల్డ్ పేరుతో విదేశాలకు తరలించి వేలకోట్లు దోచుకున్నారు, అదే అవినీతి సొమ్ముతో సాక్షి పత్రిక,టివిలను కూడా పెట్టారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కడపకు జగన్ చేసింది శూన్యం, చివరకు ఆయన నియోజకవర్గం పులివెందులకు నీళ్లు ఇచ్చింది కూడా చంద్రబాబేనని తెలిపారు. ఈరోజు దాల్మియా భారత్ విస్తరణ పనులకు మేం శంకుస్థాపన చేశాం, వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా లీగల్ నోటీసులు ఇచ్చి అడ్డుకోవడమేగాక మామూళ్ల కోసం వేధించారని అన్నారు.

**వారు ఫ్యాక్షన్ తెస్తే మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం**

చంద్రబాబు నాయుడు నాలుగోసారి సిఎం అయ్యాక రాయల సీమలో ఇదివరకెన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరుగుతోంది. జెఎస్ డబ్ల్యు స్టీల్ ప్లాంట్ కు ఇటీవల భూమిపూజ చేశారు, అంతకుముందు ఎస్ఎఇఎల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్ ను ప్రారంభించాం, జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ కిచెన్లు ఏర్పాటుచేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. పరిశ్రమలతోపాటు హార్టి



కల్చర్ ను కూడా ప్రోత్సహిస్తున్నాం. గొడ్డలి పార్టీ ఫ్యాక్షనిజం తెస్తే మేం ఫ్యాక్టరీలు తెచ్చాం, రాయలసీమలో వారు రక్తాన్ని పారిస్తే, మేం ఉద్యోగాల పంట పండిస్తున్నాం. వారు అధికా రంలో ఉండగా చంద్రబాబు నాయుడును ఇంటి నుంచి బయటకు రానీయకుండా గేట్లకు తాళాలు వేయించారు, ఈ రోజు జగన్ స్వేచ్ఛగా ఎక్కడకు వెళ్లడానికైనా అనుమతి ఇస్తున్నాం. ఇదే ప్రొద్దుటూరులో బిసి నేత నందం సుబ్బయ్యను వైసిపి హయాంలో దారుణంగా హతమార్చారు, మేం వారి కుటుంబానికి అండగా నిలిచి, వారి బిడ్డలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలులో చదివిస్తున్నామని చెప్పారు.

**ఎంతచేసినా కార్యకర్తల రుణం తీర్చుకోలేం**

వైసిపి హయాంలో ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలే. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేం. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నాపై కోడిగుడ్లతో దాడిచేసి, భయపెట్టాలని చూశారు. జిఓ నెం 1 పేరుతో పాదయాత్రను అడ్డుకోవాలని విఫలయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట కడప జిల్లా. మధ్యలో రెండు ఎన్నికల్లో ఇబ్బందిపడినా గత ఎన్నికల్లో మళ్లీ పార్టీకి గతవైభవం తెచ్చారు. అధికారంలోకి వచ్చామని కష్టకాలాన్ని మర్చిపోకూడదు. నేను పాదయాత్ర బుక్ చూసినపుడు ఆనాటి స్మృతులన్నీ గుర్తుకువస్తుంటాయి. మినీ ముంబాయిగా పేరొందిన ప్రొద్దుటూరు బంగారు వ్యాపారానికి దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.



# మొక్కుబడిగా డిఆర్సి సమావేశం

**ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 15)**

జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సి ఉండగా, ప్రస్తుతం అవి మొక్కుబడిగానే నిర్వహిస్తున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుల గొంతును నొక్కి వేస్తున్నారని, అధికారులు సమాధానం చెప్పాల్సి ఉన్న సమాధానాలు మంత్రులు ఎమ్మెల్యేలు చెప్తున్నారు అని ఆయన అన్నారు, డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యర్రగొండపాలెం ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైనప్పటికీ, ఇప్పటికీ అక్కడ ఎస్సీ విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టల్ లేకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అలాగే నియోజకవర్గం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హెచ్చరిక బోర్డులు, సర్వీస్ రోడ్లు, స్పీడ్ నియంత్రణ చర్యలు వంటి అంశాల్లో నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్డు వేసేందుకు కలెక్టర్ పర్మిషన్ తీసుకున్న అవి వేయలేదని, అధికార పార్టీ నాయకులకు ఇష్టం వచ్చిన చోట వేసుకున్నారని అన్నారు. జిల్లాలో విద్య, వైద్యం,

# కార్యకర్తలే టీడీపీకి అతిపెద్ద బలం

**కూటమిపై బురద చల్లడమే లక్ష్యంగా జగన్ పర్యటన**

**వంద జన్మలెత్తిన జగన్ అధికారంలోకి రావడం అసాధ్యం**

**కొండపిలో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణలో మంత్రులు ఆనం, గొట్టిపాటి, డోలా**



**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 15)**

కొండపి నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు, దివంగత నేత దామచర్ల ఆంజనేయులు విగ్రహాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. కూటమికి అఖండ విజయం దక్కడానికి ప్రధాన కారణం పార్టీ కార్యకర్తలేనని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా అంకితభావం కలిగిన కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. అక్రమ కేసులు బనాయించి చంద్రబాబు నాయుడిని జైలుకు పంపించిన సమయంలో కూడా కార్యకర్తలు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా



# నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

## షణ్ముఖ వెలుగు కథనం పై స్పందన




**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 15)**

మైదుకూరు పట్టణం బద్వేల్ రోడ్డులోని సాయి సమన్వి హాస్పిటల్ వీధిలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గతంలో ఈ వీధిలో ఒక విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో, విద్యుత్ శాఖ సిబ్బంది దానికి ఇనుప యాంగిలర్స్ (ఆంగ్లర్స్) బిగించి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. అయితే దీనివల్ల ప్రమాద భయం పొంచి ఉందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై 'షణ్ముఖ వెలుగు' దినపత్రికలో 12వ తేదీన "ప్రమాదాల ముంగిట సాయి సమన్వి హాస్పిటల్ సందు" అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది.

**అధికారుల శీఘ్ర స్పందన...**షణ్ముఖ వెలుగు కథనానికి విద్యుత్ శాఖ అధికారులు అత్యంత వేగంగా స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఏడీఈ, ఏఈలు తక్షణమే చర్యలు తీసుకున్నారు. కథనం ప్రచురితమైన రెండు రోజుల్లోనే పాత, విరిగిన స్తంభం స్థానంలో సరికొత్త నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

**కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు..**సమస్య పై త్వరితగతిన స్పందించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసిన మైదుకూరు విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈ లను, అలాగే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'షణ్ముఖ వెలుగు' ప్రతినిధులకు సాయి సమన్వి హాస్పిటల్ యజమాని ఓబయ్య, స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.




# జిల్లా అభివృద్ధికి అధికారులు చురుగ్గా వ్యవహరించాలి

**జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**






**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 15)**

జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం మరింత సమన్వయంతో చురుకుగా వ్యవహరించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, ప్రకాశం, మార్కాపురం జిల్లాల ఇన్చార్జి మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన అధ్యక్షతన ఉమ్మడి ప్రకాశం జిల్లా డిఆర్‌సి సమావేశం ప్రకాశం భవనంలో జరిగింది. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రకాశం, మార్కాపురం జిల్లాల కలెక్టర్లు పి రాజాబాబు, ఎం విజయ సునీత, ఉమ్మడి జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల జాయింట్ కలెక్టర్లు కల్పనా కుమారి, పులి శ్రీనివాసులు, కందుకూరు సబ్ కలెక్టర్ డి హిమవంశీ, ఇరు జిల్లాల ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. అటవీ, తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్, వ్యవసాయ, అనుబంధ శాఖలు, రోడ్డు భవనాలు, నీటిపారుదల రంగాలపై ఈ సమావేశంలో

# కార్యకర్తలే టీడీపీకి అతిపెద్ద బలం





పార్టీ కోసం అండగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. జరగనివి జరిగినట్లుగా చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే వాస్తవాలను గుర్తించారని, అందువల్ల జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని మంత్రి అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల విశ్వాసాన్ని చూరగొని కూటమి విజయపథంలో ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో వేలకోట్లు దోచుకున్నారు

ఇటీవల జొన్నగిరి గోల్డ్ మైన్ ను ప్రారంభించిన చంద్రబాబు గారు రాయలసీమను గోల్డ్ హబ్ గా మార్చేందుకు కృషిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ప్రొద్దుటూరులో నాలుగుసార్లు టిడిపి గెలిచింది.

**కోటిమంది కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు సహజం**

2025 కడపలో జరిగిన మహానాడులో ఆరుశాసనాలను తీసుకున్నాం. అందులో ముఖ్యమైంది కార్యకర్తే అధినేత. దానిని చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. కోటిమందికి పైగా కార్యకర్తలున్న అతిపెద్ద కుటుంబం మనది. ఇంత భారీ వ్యవస్థలో చిన్నచిన్న సమస్యలు సహజం. బూత్, క్లస్టర్, మండల, నియోజకవర్గ, పార్లమెంటు, జోనల్ స్థాయిల్లో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఆ దశల్లో పరిష్కారం కాకపోతే కేంద్ర కార్యాలయం దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం. కార్యకర్తల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత నాయకులందరిపైనా ఉంది. పార్టీలో సంస్కరణల కోసం నేను ఎంతో పోరాటం చేయాల్సి వచ్చింది. సమస్యలను నాలుగుగోడల నడుమ బాబుగారితో చర్చిస్తాం. బయటకు వచ్చాక జై తెలుగుదేశం, జై చంద్రబాబు అని ముక్తకంఠంతో నినదించాలి.

**క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తను గుర్తించే బాధ్యత నాది**

సీనియర్ నేత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని పార్టీ కేడర్ అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి. ప్రతిపక్షంలో ఈ నియోజకవర్గంలో అనేకమంది నేతలు నాతో కలసి నడిచారు. వారందరినీ కలుపుకొని వెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంది. పార్టీలో వర్గాలు ఉండకూడదు. వర్గాల వల్ల పార్టీ నష్టపోతుంది. నాయకులు పార్టీని నమ్మి పనిచేయండి, వారికి సరైన స్థానం కల్పించే బాధ్యత మేం తీసుకుంటాం. కష్టపడిన నాయకులను గుర్తించేందుకే మై టిడిపి యాప్ తెచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో పనిచేసే 4లక్షలమంది నాయకుల పనితీరును అంచనా వేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఏ కార్యక్రమం చేసినా మై టిడిపి యాప్ ద్వారా పార్టీ దృష్టికి తీసుకురండి. పదవులు వాటంతట అవే మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తాయి. నామినేటెడ్ పోస్టులకు ఎంపిక ప్రక్రియను చంద్రబాబు నాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తొలివిడతలో అవకాశం రానివారికి మలివిడతలో వస్తుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తను గుర్తించే బాధ్యత నాది.

**ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాల అమలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు నడిపిస్తున్నాం. ఈ నెల 24వ తేదీన రెండో విడత తల్లికి వందనం నిధులు జమ చేయబోతున్నాం. దేశంలో మరెక్కడా లేనివిధంగా రూ.4వేల పెన్షన్ అందజేస్తున్నాం. దీపం-2 పథకంలో ఏడాదికి 3 గ్యాస్ సిలండర్లు, స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు, చేనేతలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నాం. ఎన్నికల్లో హామీ ఇవ్వని అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేశాం. యువగళంలో ఇచ్చిన హామీ మేరకు 16వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీచేశాం. 10వేల పోస్టులతో జాబ్ క్యాలండర్ ప్రకటించాం. ఒకవైపు గతంలో చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ మరోవైపు సంక్షేమాన్ని పద్ధతి ప్రకారం కొనసాగిస్తున్నాం. వైసిపి హయాంలో ఆరుసార్లు విద్యుత్ చార్జీలు పెంచితే కూటమి ప్రభుత్వంలో ట్రూడౌన్ చేసి తగ్గించాం, చెత్తపై పన్ను వంటి వాటిని తొలగించాం. 60వేలకోట్ల లోటు బడ్జెట్ ఉన్నా సంక్షేమ పథకాలను సంతృప్తస్థాయిలో అందజేస్తున్నాం. మరో ఏడాది కష్టపడితే ఆర్థిక సమస్యలను అధిగమిస్తాం. సర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా ప్రజాప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం నింపాల్సిన బాధ్యత పార్టీ కేడర్ పై ఉంది.

**రాష్ట్రాభివృద్ధి కోసమే మూడు పార్టీల కలయిక**

కేవలం రాష్ట్రాభివృద్ధే ఏకైక ఎజెండాగా టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయి. ఒకరి పేరుతో మరొకరిని ఉసిగొల్పేలా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి రెచ్చగొట్టేందుకు వైసిపి పేటిఎం బ్యాచ్ ప్రయత్నిస్తారు. కూటమి కేడర్ అప్రమత్తంగా, ఐక్యంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలి. ఎట్టి పరిస్థితులు ఎదురైనా దీర్ఘకాలం కూటమి కొనసాగుతుంది. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోడీజీ అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. విశాఖ స్టీల్ కు నిధులు, రైల్వే జోన్, బిపిసిఎల్ వంటి భారీ ప్రాజెక్టులను రాష్ట్రానికి ఇచ్చారు. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాం. సరైన సమయంలో సరైన నాయకుడు ప్రధాని మోడీ. ఆయన నేతృత్వంలో కలసికట్టుగా ముందుకు సాగుతాం. కార్యకర్తలు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో మాదిరిగానే పనిచేయండి. రాబోయే ఎన్నికల్లో ప్రతి బూత్, ప్రతి ఓటు మనకు కీలకమే. భారీ మెజారిటీతో నెగ్గిన మంగళగిరిలో కూడా 20 బూత్‌లలో మైనస్ వచ్చింది. ప్రజలతో బంధాన్ని ఏర్పాటుచేసుకొని మమేకమై ముందుకు సాగాలని యువనేత లోకేష్ పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# మొక్కుబడిగా డీఆర్సి సమావేశం

రహదారులు, తాగునీరు తదితర సమస్యలు పేరుకుపోతున్నప్పటికీ, డీఆర్సీ సమావేశాల్లో వాటిపై సమగ్రంగా చర్చించడం లేదని ఆయన విమర్శించారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తున్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, సమావేశాలు కేవలం నివేదికలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఉండాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలోని లోటుపాట్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు.

# నేడు వినుకొండ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 15)**

నియోజకవర్గ ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చీఫ్ విప్ కార్యాలయ నిర్వహణ అధికారి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి 1.00 గంట వరకు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వయంగా ప్రజల నుండి అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించనున్నారు. వినుకొండ పట్టణంతోపాటు, నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రజలు ప్రజా దర్బార్‌కు హాజరై తమ సమస్యలను చీఫ్ విప్ జీవి దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార మార్గం చూపడం జరుగుతుందని, ప్రజల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# జిల్లా అభివృద్ధికి అధికారులు చురుగ్గా వ్యవహరించాలి

ప్రధాన చర్చ జరిగింది. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలు, ప్రస్తావించిన అంశాలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇరు జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో చెప్పారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లాకు పూర్తిస్థాయిలో అధికారులను కేటాయించనందున ప్రస్తుతం ఇరు జిల్లాలకు కలిపి డీఆర్‌సీ సమావేశం పెట్టామన్నారు. తదుపరి సమావేశం ఆయా జిల్లాలలోనే వేరువేరుగా ఉంటుందన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పినందున తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆయన చెప్పారు. చేపలు పట్టుకునేందుకు చెరువులో నీళ్లు ఇష్టారాజ్యంగా వదిలేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేస్తామన్నారు. హార్టికల్చర్ హబ్ గా మార్కాపురం జిల్లాను ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదని, రైతులకు అవసరమైన పరికరాలను, స్ప్రింక్లింగ్ లను ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. వెలుగొండ ఫలాలను ప్రజలు సత్వరం పొందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయా విషయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. వాణిజ్య పంటల వైపు రైతులను మళ్లించాలని అధికారులకు చెప్పారు. రిజర్వు ఫారెస్ట్ అధికారులు కేంద్రం పరిధిలో ఉన్నాము కదా, రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేనట్లు వ్యవహరిస్తే కుదరదని మంత్రి హెచ్చరించారు. అటవీ భూముల పరస్పర మార్పిడి, స్థానిక గిరిజనులకు ఉద్యోగ కల్పనలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించకుండా చూడాలని అధికారులకు చెప్పారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ చెరువులోని చేపలను పట్టుకునేందుకు నీటిని వదిలేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. ప్రస్తుతం ఎల్ నినో పరిస్థితుల్లో ఇలాంటి చర్యల వలన ఆయా చెరువుల్లో నీరు వృధా కావడంతో పాటు సమీప గ్రామాల్లోని భూగర్భ నీటిమట్టం కూడా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీటి పైప్ లైన్ల కోసం రోడ్లను తవ్వుతున్నారని, అనంతరం వాటిని సక్రమంగా పూడ్చకుండా వదిలేయడం వలన ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. పైపులైన్లు వేసే కాంట్రాక్టర్లే తిరిగి రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉంటుందన్నారు. సంబంధిత కాంట్రాక్టు లోనే ఈ విషయాలను స్పష్టంగా పొందుపరుస్తున్నందున అధికారులు వాటిని అమలయ్యేలా పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. 2014-19 కాలంలో పంచాయతీరాజ్ శాఖలో చేపట్టిన పనులకు బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు కలెక్టర్ తో చర్చించి బిల్లులను ప్రభుత్వానికి పంపించాలని ఆయన చెప్పారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాలను నివారించేందుకు పెట్రోలింగ్ వాహనాలను సమర్థంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. మేదరమెట్ల మంచినీటి పథకానికి సంబంధించిన నిర్వాసితులకు బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినందున అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. జాతీయ రహదారుల్లో నీళ్లు నిలిచిపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. మంత్రి స్వామి మాట్లాడుతూ అటవీ అధికారులు చురుకుగా స్పందిస్తే వారి పరిధిలో లేని భూములు రెవెన్యూ శాఖ పరిధిలోకి వస్తాయని, వీటిని పరిశ్రమల ఏర్పాటుకు వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈ పరిస్థితి తన నియోజకవర్గంలో కూడా ఉందన్నారు. తూర్పు నాయుడుపాలెం సమీపంలోని బాపూజీ కాలనీ వద్ద కూడా జాతీయ రహదారిని దాటేందుకు ప్రజలు సుమారు మూడు కిలోమీటర్లు వెళ్లి తిరిగి రావాల్సి వస్తున్నట్లు చెప్పారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సింగరాయకొండలోని జాతీయ రహదారిపై ఉన్న ఎమర్జెన్సీ లాండింగ్ ఫెసిలిటీ వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. దీనితోపాటు జిల్లా యంత్రాంగం ఇచ్చే నివేదికలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ అటవీ భూముల విషయంలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య యాజమాన్య హక్కులపై స్పష్టత కావాల్సి ఉందన్నారు. కొత్తపట్నం మండలం పల్లెపాలెం అటవీ భూములకు సంబంధించి ఆర్.ఎస్.ఆర్. లో అటవీ భూములుగా ఉందని, అయినా తమవి కావని ఆ శాఖ అధికారులు అంటున్నారని చెప్పారు.

ఈ దృష్ట్యా వాటిని రెవెన్యూ భూములుగా బదలాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేదరమెట్లలోని మంచినీటి పథకం నుంచి అద్దంకి, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాలకు మంచినీటి సరఫరా జరుగుతున్నందున పైపుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని, అవకాశం ఉంటే డిఎంఎఫ్ నిధులను వినియోగించాలని చెప్పారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రంగనాయక స్వామి ఆలయం వద్ద 60 సెంట్లు రిజర్వు అటవీ భూమి అవసరం ఉన్నదని, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని రిజర్వ్ ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ఆ భూమిని కేటాయిస్తే ప్రత్యామ్నాయ భూమి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రిజర్వు ఫారెస్ట్ లో వెదురు బొంగుల ఆధారంగా జీవనోపాధి పొందుతున్న స్థానిక గిరిజనులకు ఔట్‌సోర్స్ విధానం ద్వారా ఉపాధి కల్పించేలా దృష్టి సారించాలన్నారు. బేస్తవారిపేట నుంచి కంభం వరకు జాతీయ రహదారి పైన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం, పొదిలిలో త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తినప్పుడు ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లు సరఫరా చేసిన వారికి రెండేళ్లుగా బిల్లులు పెండింగ్లో ఉన్నాయన్నారు. పొదిలి నగర పంచాయతీగా మారక మునుపు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్లో ఉన్నాయన్నారు. వీటి చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జాతీయ రహదారుల పై గ్రామాల్లో లైట్లు లేవని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల చిరకాల కోరిక అయిన వెలుగొండ ప్రాజెక్టు ఫలాలు పొందేందుకు సమయం ఆసన్నమైంది అన్నారు. ఈ దిశగా సహకరించిన అధికారులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు కాలువ మార్గం మీదగా గ్రీన్ ఫీల్డ్ రహదారి వెళ్తూ ఉందని చెప్పారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు డీపీఆర్‌ను పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో చేయాలన్నారు. లేనిపక్షంలో 100 కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చుపెట్టి మరోసారి నిర్మాణం చేపట్టాల్సిన పరిస్థితి తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎండ్లూరు చెరువులో ఉన్న చేపలను పట్టుకోవటం కోసం అంటూ నీటిమట్టం తగ్గినప్పటికీ సాగర్ జలాలతో నింపడంలో అధికారులు వేచి చూసే ధోరణితో వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారులపై నీళ్లు నిలుస్తున్నాయని, రోడ్ల వెంట డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అన్నారు. దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్కాపురం-సంతనూతలపాడు-కొండపి మీదగా రామయ్యపట్నం పోర్టుకు కొత్త రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఈల కొరత ఉందన్నారు. ప్రకాశం జిల్లాలో విలీనమై ఆరు నెలలు గడిచినందిన ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో సిసి రోడ్ల నిర్మాణం, మంచినీటి బోర్లకు మరమ్మతుల అవసరం ఉందన్నారు. ఎయిమ్స్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, మార్కాపురం జిల్లాలో పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వెలుగొండ నుంచి టీ 5 కాలువ నిర్మాణం పై దృష్టి పెట్టాలని కోరారు. చిన్న స్పెల్లింగ్ దోషాల వలన వెలుగొండ ప్రాజెక్టు పరిహారం పొందటంలో 1150 మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ పర్యాటక శాఖ తరఫున హోటల్స్ నిర్మించేందుకు మార్కాపురంలో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. తన సొంత గ్రామమైన బింగినపల్లిలో కూడా చేపలను పట్టుకునేందుకు చెరువులోని నీటిని వదిలేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర సాంస్కృతిక మిషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ ఒంగోలులో డాన్స్, మ్యూజిక్ అకాడమీ నిర్మించేందుకు ఫీజిబిలిటీ రిపోర్టును త్వరగా ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత సంవత్సరం తొలి ఆరు నెలల్లో మహిళలపై నేరాలు 23 శాతం తగ్గాయి అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేయకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకునేందుకు, వాటి వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు విస్తృతం చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 220 కుంభాకార దర్పణాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ మిషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మాల కార్పొరేషన్ చైర్మన్ పి విజయకుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో మృతి చెందిన వినుకొండ విద్యార్థిని ప్రసన్న కుటుంబానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ప్రగాఢ సానుభూతి



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 15)**

అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన విద్యార్థిని మక్కెన ప్రసన్న మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని అన్నారు. మక్కెన ప్రసన్న మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో జీవీ ఆంజనేయులు ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయంలో విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నేతలు

## జిల్లా ఉపాధ్యక్షులుగా కొండపల్లి చిన్న సుబ్బారావు నియామకం

**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 15)**

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు, కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం బద్వేలు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ సివి నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు కెవి సుబ్బారావు, జిల్లా యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పైడిమర్రి సురేష్‌బాబు, జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి ట్రెజరర్ దేవతి లలితలకు ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికింది. అమ్మవారి సన్నిధిలో వీరందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, ట్రెజరర్ భూపాలం నాగరాజారావు, కమిటీ సభ్యులు జిల్లా నాయకులను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం బద్వేలుకు



చెందిన ప్రముఖ వైశ్య నాయకులు, ఆలయ కమిటీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావును కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ప్రకటించారు. ఈ సందర్భంగా చిన్న సుబ్బారావును శాలువాతో సత్కరించి, సంఘ బలోపేతానికి ఆయన మరింత కృషి చేయాలని కోరుతూ అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభలో ప్రతి ఒక్కరు సభ్యత్వం కలిగేలా అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు చూడాలని వారికి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మాలేపాటి వెంకటేశ్వరరావు, దిండుకుర్తి సుబ్బరాయుడు, చిన్ని నరసింహులు, కొప్పరపు శ్రీనివాసులు, సగల రాధాకృష్ణమూర్తి, బెస్త వేముల సునీల్ కుమార్, కొండపల్లి సాయి, గుబ్బ వెంకటేశ్వర్లు, పలువురు కమిటీ సభ్యులు, సంఘ నేతలు పాల్గొన్నారు.





# మండలంలో పొలం పిలుస్తుంది





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 15)**

మండలంలోని కుంచేపల్లి, దాసల్లపల్లి రైతు సేవా కేంద్రాల నందు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా, డిఏపీ, ఎరువులు పంపిణీ చేస్తారన్నారు. ఈ పంట నమోదు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ఎల్‌నీనో ప్రభావం తక్కువ నీటితో సాగయే పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలాగా ప్రభుత్వం ఏపి ఏ ఐఎంఎస్ యాప్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వారు వేసిన పంటల వివరాలను వెంటనే రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ 2026 సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులు స్వతహాగా వారి పంటకు బీమా రైతు వాటా వారే చెల్లించాలని తెలిపారు. ఈ ఖరీఫ్ 2026 సీజన్లో వరి, కంది, సజ్జ, మినుము, నువ్వులు, ఎండు మిరప మొదలైన పంటలకు పంటల బీమా పథకం క్రింద వర్తిస్తాయని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం క్రింద కంది, సజ్జ, మినుము, నువ్వు, మిరప పంటలకు 31 జూలై 2026 వ తేదీ వరకు, వరి పంటకు 15 ఆగస్టు 2026వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. రైతులు వారి యొక్క ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుబుక్, పంట ధ్రువీకరణ పత్రము, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్, మొదలైనవి వివరాలు తీసుకొని మీ దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్ నందు పంట బీమా నమోదును రైతులే స్వతహగా చేసుకోవచ్చని తెలిపారు. పై పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పంటల బీమాను నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకి ఎకరాకి రూ.860, కంది పంట ఎకరాకి రూ.430, సజ్జపంట ఎకరాకి రూ.156, మినుములు ఎకరానికి రూ.205, నువ్వులు ఎకరానికి రూ.180, ఎండుమిరప పంట ఎకరాకి రూ.4,500 ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలియజేశారు. అలాగే రైతులు ఎవరి దగ్గరైన పొలంను కౌలుకు తీసుకొని ఉంటే తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రంని గ్రామ రెవిన్యూ అధికారిని సంప్రదించి పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ





**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 15)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు, యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో 10 మందికి స్వయంగా వారి ఇండ్లకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం పంపిణి చేశారు. సీఎం సహాయ నిధి పొందిన వారిలో చీతిరాల వెంకట సుబ్బారావు (గొట్లగట్టు) రూ.40,000, వంకాయలపాటి వంశీ (గొట్లగట్టు) రూ.60,276, మద్దూరి వెంకట నరసింహ (గొట్లగట్టు) రూ.1,00,198, కరేటి అనిష్ (ఇరసలగుండం) రూ.70,000, గొంగటి రోజా (కాట్రగుంట) రూ. 18,000, కాకి యమున (పాతపాడు) రూ.30,786, కానాల నాగేశ్వరరావు (పెదారికట్ల) రూ.30,786, దిరిశల సౌజన్య (సిద్ధవరం) రూ.1,72,758, గౌతుకట్ల కోటమ్మ (ఎదురాళ్లపాడు) రూ.30,786, ఏరువ రమణమ్మ (ఎదురాళ్లపాడు) రూ.37,378 వెరసి రూ.5,90,968ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడప, బద్వేల్ ప్రధాన రహదారి

## కల్వర్టు సమస్యకు శాశ్వత పరిష్కారం

### అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్

### 'జనతా వారధి' ద్వారా త్వరితగతిన సమస్యల పరిష్కారం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జులై 15)**

కడప, బద్వేల్ ప్రధాన రహదారిలోని అత్యంత ప్రమాదకరమైన కల్వర్టు సేఫ్టీ వాల్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు ఎంత వేగంగా పరిష్కారమవుతున్నాయో చెప్పడానికి ఈ పనుల పూర్తికావడమే నిదర్శనమని బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్ పేర్కొన్నారు. ఈ రహదారిలో ప్రమాదకరమైన మలుపు (కర్వ్) ఉండటం వల్ల నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండేవారు. ఈ సమస్య తీవ్రతను గమనించిన బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీ బొమ్మన విజయ్, ఇతర బీజేపీ నాయకులతో కలిసి ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నిత్యం ప్రయాణించే వందలాది మంది ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ కల్వర్టు వద్ద తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

**20 రోజుల్లోనే పనులు పూర్తి....**

బిజెవైఎం వినతి పై జిల్లా కలెక్టర్ అత్యంత సానుకూలంగా స్పందించారు. జిల్లా యంత్రాంగం, ఆర్ అండ్ బి అధికారులను వెంటనే రంగంలోకి దించి, కేవలం 20 రోజుల స్వల్ప వ్యవధిలోనే అక్కడ అవసరమైన రహదారి భద్రతా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. ప్రమాదకరమైన కర్వ్ సమస్యను విజయవంతంగా పరిష్కరించారు.

**అధికారుల చొరవ అభినందనీయం : బొమ్మన విజయ్**

ప్రజల ప్రాణ రక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వినతిపత్రం అందిన వెంటనే స్పందించి అత్యంత వేగంగా పనులను పూర్తి చేయించిన జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం, ఆర్ అండ్ బి అధికారులకు బొమ్మన విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారుల ఈ చొరవ ఎంతో ప్రశంసనీయమన్నారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే "జనతా వారధి" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ, యువజన విభాగమైన బిజెవైఎం నిరంతరం కృషి చేస్తాయని బొమ్మన విజయ్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.




# గ్రామీణ ఉపాధికి వీబీజీరామ్‌జీతో మరింత భరోసా

### ఎంపిడిఓ ధనలక్ష్మి

### 125 రోజుల పని పై అవగాహన కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 15)**

వీబీజీరామ్‌జీ కార్యక్రమ అమలతో కుటుంబానికి ఉపాధి కల్పించే పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెరగటంతో గ్రామీణ కుటుంబాలకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలు మరింత మెరుగుపడుతందని మండల ఎంపిడిఓ కె.ధనలక్ష్మి అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామపంచాయతీలోని ఎస్టీ కాలనీ నందు మండల ఎంపీడీవో కె.ధనలక్ష్మి అధ్యక్షతన ఎపిఓ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశరరావు పర్యవేక్షణలో ఉపాధి కూలీలకు వీబీజీరామ్‌జీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఓ లక్ష్మీ దేవి మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం కంటే మెరుగైన విధానాలతో వీబీజీరామ్ ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. అర్హులైన గ్రామీణ ఎస్సీ, ఎస్టీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె ధనలక్ష్మి, ఎపిఓ లక్ష్మీకుమారి, సెక్రటరీ నాగమల్లేశరరావు, టిఏ, ఫీల్డ్ అసిస్టెంట్ వడ్లమూడి రామకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఏపీ కరాటే ఛాంపియన్స్ 2026 నేషనల్ సెలక్షన్స్‌లో మాంటిస్సోరి విద్యార్థులకు రెండు కాంస్య పథకాలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 15)**

ఆంధ్ర ప్రదేశ్ ఛాంపియన్షిప్స్ 2026 నేషనల్ సెలెక్షన్స్ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా నుంచి పొదిలి పట్టణం మాంటిస్సోరి స్కూల్ కు చెందిన విద్యార్థులు రెండు కాంస్య పథకాలను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాప్ చైర్మన్ రవి నాయుడు గారు పాల్గొని మార్కాపురం జిల్లా పొదిలికి చెందినటువంటి మాంటిస్సోరి విద్యార్థులు వి. లిఖిత (8వ తరగతి) మరియు ఎ. అన్సుల్ (10వ తరగతి) వారికి మెడల్స్ ప్రధానం చేశారు. స్థానిక మాంటిస్సోరి స్కూల్ కు కొరియర్ ద్వారా సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ ను పంపించారు. ఈ సందర్భంగా స్థానిక మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ శ్రీనివాస్ గారు కరాటే మాస్టర్ వేణు గారిని ఘనంగా సత్కరించారు మరియు పిల్లలకు మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ బహుకరించి వారిని మరింత ప్రోత్సాహపరిచే విధంగా బహుమతి ప్రధానం చేశారు ఈ సందర్భంగా కరాటే మాస్టర్ వేణు గారిని ఘనంగా సన్మానించారు అలాగే తమ పాఠశాలలోని విద్యార్థులకు కరాటే నేర్పించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గంజాయితో ఆటోడ్రైవర్ అరెస్ట్
## 1.050 కిలోల గంజాయి స్వాధీనం




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 15)
గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కందుకూరు టౌన్ పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 1 కిలో 50 గ్రాముల గంజాయితో పాటు నంబర్ లేని పల్సర్ మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కందుకూరు ఎస్డీపీఓ పర్యవేక్షణలో, కందుకూరు సీఐ ఎస్.కె. అన్వర్ బాషాకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కేసులో దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కావలి మండలం ముసునూరు గ్రామానికి చెందిన కట్టా యోహాన్ అనే ఆటోడ్రైవర్ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 1.050 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు అతడిని అరెస్టు చేసి గంజాయితో పాటు నంబర్ లేని పల్సర్ బైక్ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సీలేరు, ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి గుడ్లూరు, కందుకూరు పరిసర ప్రాంతాల్లో పలువురికి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ గంజాయి సరఫరా వ్యవస్థకు సంబంధించిన మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని కోర్టు అనుమతితో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ పరీక్షలకు పంపేందుకు చర్యలు చేపట్టారు. ఈ కేసును ఛేదించిన కందుకూరు పోలీసులను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అభినందించారు.

ఎస్పీ హెచ్చరిక : గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటి తయారీ, రవాణా, నిల్వ, విక్రయం, వినియోగంలో పాల్గొనే వారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి హర్షవర్ధన్రాజు హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేసి నిర్మూలనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సూర్య శ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థిని కాలేజీ ఫీజుకి రూ.42వేలు ఆర్థిక సాయం అందజేత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 15)
పేదరికంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సూర్య శ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. ఒంగోలు బలరాం కాలనీలో నివసిస్తున్న షేక్ సుభాని ఆటో డ్రైవర్ ఆటో నడుపుకుంటూ వచ్చిన చిన్న ఆదాయంతో జీవిస్తూ ఉంటారు. వారి కుమార్తె షేక్ మదిని హర్షిణి కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుకుంటూ 500 కి 491 సాధించింది. కాలేజీ ఫీజు నిమిత్తం ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ భాషను సంప్రదించగా స్పందించిన సర్దార్ ప్రవాస భారతీయుడు ఆర్ల అనుదీప్ చౌదరి సహకారంతో రూ.42 వేలు ఆర్థిక సహాయాన్ని స్వయంగా కాలేజీ దగ్గరికి వెళ్లి అందజేశారు. ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ భాష మాట్లాడుతూ షేక్ మదిని కుటుంబ ఇబ్బందులను మా దృష్టికి తీసుకురాగానే, వారి పరిస్థితిని పూర్తిగా పరిశీలించి ఈ సహాయాన్ని అందించాము. మదిని ఇంకా పై చదువులు చదువుతానంటే ఆ కుటుంబానికి తప్పకుండా అండగా ఉంటా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే మా సూర్యా శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన లక్ష్యం అని సర్దార్ భాష తెలిపారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సర్దార్ భాష స్పందించి అందించిన ఈ సాయం మరువలేనిది. మా కుమార్తె చదువు సజావుగా జరగడానికి సహకరించిన సర్దార్ భాషకి దాత ఆర్ల అనుదీప్ చౌదరి, సూర్య శ్రీ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు అని వారు తెలిపారు.

## నూతన చీరాల డిడిఓను మర్యాద పూర్వకంగా కలిసిన ఎపిజీఇఏ సంఘ నాయకులు



(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 15)
బాపట్ల జిల్లా చీరాల డివిజన్ నూతన డిడిఓగా అర్ఇవి ఫణికుమర్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా అధ్యక్షులు వై డానియల్ ప్రసాద్, సెక్రటరీ దేవరకొండ దినేష్, జివివి రాఘవరెడ్డి, పుల్లారావు, వై అవినాష్, పులి సురేష్, శ్రీనివాస్, గోపి కృష్ణ, వెంకాయమ్మ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉద్యోగుల సమస్యలు, డివిజన్ ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించారు.

## ఆధార్ వ్యత్యాసాల పరిష్కారంలో అప్రమత్తంగా ఉండాలి

### ఎంఈవో అబ్దుల్ సత్తార్







(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 15)
విద్యార్థుల ఆధార్ వ్యత్యాసాల పరిష్కారంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన ప్రతి విద్యార్థి తల్లికి ప్రభుత్వం అందిస్తున్న 'తల్లికి వందనం' పథకం నగదు సకాలంలో జమ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) అబ్దుల్ సత్తార్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆయన కంభం పట్టణంలోని నాయక్ వీధి ప్రాథమిక పాఠశాల, శ్రీ సత్యనారాయణ ఎయిడెడ్ పాఠశాల, కృష్ణవేణి పాఠశాల, కందులాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, పార్క్ వీధి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, నమోదు వివరాలు, ఆధార్ వ్యత్యాసాల సవరణ ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం ఆధార్లో ఉన్న పేరు, జన్మతేదీ, తల్లిదండ్రుల ఆధార్ వివరాలు తదితర అంశాల్లో ఎలాంటి వ్యత్యాసాలు ఉన్నా వెంటనే గుర్తించి సరిచేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆధార్ వివరాల్లో చిన్నపాటి పొరపాట్లు కూడా సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, ప్రతి విద్యార్థి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో సవరించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని తెలుసుకుంటూ పలు తరగతుల విద్యార్థులతో మాట్లాడి వారి పఠనం, రాత, గణిత నైపుణ్యాలను పరీక్షించారు. విద్యార్థుల్లో ప్రాథమిక అభ్యసన సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి విద్యా పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాజరు నమోదవుతున్న తీరు, తరగతి గదుల నిర్వహణ, బోధన విధానాలను పరిశీలించిన ఎంఈవో, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులైన అన్ని కుటుంబాలకు చేరేలా పాఠశాల స్థాయిలో చర్యలు తీసుకోవాలని, ఆధార్ వ్యత్యాసాల పరిష్కారాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావించాలని ఎంఈవో స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఆర్పీ మురళీమోహన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## దామచర్ల ఆంజనేయులు ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం

### దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలకు దామచర్ల ఆంజనేయులు పరిష్కారం చూపించారు
### ఈ ప్రాంత ప్రజల గుండెల్లో పెద్దాయనగా దామచర్ల ఆంజనేయులు చిరస్థాయిగా నిలిచిపోయారు
### మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 15)



మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు సాధారణ రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 97 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డిఎస్ బీవీ స్వామి, మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య ఎన్టీఆర్, అంబేద్కర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు సాధారణ రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారు. నిజాయితీ గల వ్యక్తి వ్యక్తిత్వం, ముక్కుసూటి తత్వం దామచర్ల ఆంజనేయులు సొంతం. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం. ఈ ప్రాంతంలో దామచర్ల ఆంజనేయులు చేసిన అభివృద్ధి నేటికీ మన కళ్ళ ముందు కనిపిస్తోంది. కొండపి నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని సులభతరం చేశారు. ఈ ప్రాంతంలో దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలకు దామచర్ల ఆంజనేయులు పరిష్కారం చూపించారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో పెద్దాయనగా దామచర్ల ఆంజనేయులు చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కొనియాడారు.

## కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసి సర్టిఫికేట్ల ప్రధానం



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 15)
స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్యాడెట్ దళం (ఎన్ సీసీ) విద్యార్థులకు బుధవారం ఎన్‌సీసి సర్టిఫికేట్ల ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్, ఒంగోలు 34 ఆంధ్ర బెటాలియన్ నాయక్ సుబేదార్ సుఖ్విందర్ సింగ్, హవల్దార్ తిప్పే స్వామి సమక్షంలో, పాఠశాల ఎన్ సీసీ అధికారి కదిరిపోగు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ సీసీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 24 మంది జూనియర్ డివిజన్ (జేడీ ), జూనియర్ వింగ్ (జేడబ్ల్యూ) క్యాడెట్లకు అధికారులు ఎన్ సీసీ ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు. శిక్షణ కాలంలో క్యాడెట్లు క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దృఢత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్లు వారి భవిష్యత్ విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 26 మంది కొత్త విద్యార్థులను మొదటి సంవత్సరం ఎన్ సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేస్తూ, పాఠశాల ఎన్సీసీ ట్రూప్‌లో మొత్తం 50 మంది క్యాడెట్లు సభ్యులుగా కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయక్ సుబేదార్ సుఖ్విందర్ సింగ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించే గొప్ప సంస్థ అని పేర్కొన్నారు. ప్రతి క్యాడెట్ ఎన్ సీసీ ద్వారా పొందిన శిక్షణను జీవితాంతం ఆచరణలో పెట్టాలని, దేశానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.హవల్దార్ తిప్పే స్వామి మాట్లాడుతూ, ఎన్ సీసీ క్యాంపులు, పరేడ్‌లు, సామాజిక సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయి శిబిరాల్లో పాల్గొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ కొత్తగా చేరిన క్యాడెట్లు ఎన్ సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం వంటి విలువలను అలవరచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. చదువుతో పాటు శారీరక దృఢత్వం, సామాజిక బాధ్యత, సేవా దృక్పథం పెంపొందించుకోవడంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఎన్సీసీ అధికారి కదిరిపోగు విజయ్ కుమార్ మాట్లాడుతూ, క్యాడెట్లు ప్రతి శిక్షణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని, రాబోయే కాలంలో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీరనారాయణ, వైవి రావు, పాండురంగ బాబు, ఎన్‌సీసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దైనందినిల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 15)
మండలంలోని హజరత్ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం డైరీలను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ విద్యార్థులకు డైరీలను అందజేసి, వాటిని ప్రతిరోజూ వినియోగిస్తూ చదువులో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ, ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షబ్బీర్ మాట్లాడుతూ, విద్యార్థులు రోజువారీ పాఠ్యాంశాలు, ముఖ్యమైన విషయాలు, లక్ష్యాలను డైరీలో నమోదు చేసుకోవడం ద్వారా సమయపాలన అలవాటు అవుతుందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సామగ్రిని అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ అందించిన డైరీలను సద్వినియోగం చేసుకొని విద్యలో మరింత రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.

## సీఐ, ఎస్ఐలకు ఆహ్వాన పత్రిక అందజేసిన షిర్డీ సాయిబాబా సేవా సంఘం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 15)
పొదిలి పట్టణంలో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న గురు పౌర్ణమి మహోత్సవాలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిపించేందుకు కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం పొదిలి పోలీసు స్టేషన్‌లో స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్‌లను సాయిబాబా సేవా సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మహోత్సవానికి పోలీసుశాఖ తరపున తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కోరుతూ అధికారులిద్దరికీ పండుగ ఆహ్వాన పత్రికలను కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలను శాలువాలతో ఘనంగా సత్కరించి వేడుకలకు రావాల్సిందిగా సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఐ ఎం రాజేష్ కుమార్ మాట్లాడుతూ పండుగ రోజున భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో క్రమశిక్షణతో కూడిన వాతావరణం ఉండేలా కమిటీ సభ్యులు కూడా సహకరించాలని కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో షిర్డీ సాయిబాబా సేవా సంఘం కమిటీ ప్రెసిడెంట్ కల్వా సత్యనారాయణ, సెక్రటరీ సోమిశెట్టి చిరంజీవి, ట్రెజరర్ యాదల వెంకటేశ్వర్లు, అన్న సత్రం ప్రెసిడెంట్ సోమిశెట్టి శ్రీనివాసులు, సెక్రటరీ సామి రాజ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి భారీగా వినతులు స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కారాలు చూపిన లోకేష్

## కొత్త ప్లాంట్‌తో మరో 1,000 మంది స్థానిక యువతకు ఉద్యోగాలు






**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 15)**

కడప జిల్లా పారిశ్రామికంగా మరో ముందడుగు వేసింది. మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమకు సంబంధించిన రెండో ప్లాంట్ (లైన్-2) విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం ఘనంగా శంకుస్థాపన చేశారు. రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో చేపట్టనున్న ఈ విస్తరణ పనుల భూమిపూజ కార్యక్రమంలో లోకేష్‌తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**లోకేష్ పర్యటనలో 'ప్రజా దర్బార్' వినతుల మహోత్సవం**

దాల్మియా ప్లాంట్ విస్తరణ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కు కడప ప్రజలు, పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. అయితే, శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లడానికి ముందే మంత్రి లోకేష్ ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి నియోజకవర్గ మూలమూలల నుండి వేలాదిగా తరలివచ్చిన అశేష జనవాహినిని ఆయన ఆప్యాయంగా పలకరించారు. ప్రజల నుంచి భారీ ఎత్తున వినతిపత్రాలను మంత్రి స్వీకరించారు. వృద్ధులు, మహిళలు, యువత, రైతులు తమ ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన ఎంతో ఓపికగా ప్రతి ఒక్కరి సమస్యను విన్నారు. కేవలం అర్జీలు తీసుకోవడమే కాకుండా, ప్రజా సమస్యల పట్ల తక్షణమే స్పందించారు. అక్కడికక్కడే అధికారులను పిలిచి పలు సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. "ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత" అని, అర్జీలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా లోకేష్ భరోసా ఇచ్చారు. ప్రజాసమస్యల పట్ల మంత్రి చూపిన ఈ చొరవపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**రోబో ల్యాబ్ పరిశీలన.. కార్మికులతో సెల్ఫీలు**

అనంతరం దాల్మియా ప్లాంట్ ఆవరణకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ఉన్నతాధికారులు ఘనస్వాగతం పలికారు. ముందుగా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లోని అత్యాధునిక రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి సందర్శించి సాంకేతికత పనితీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్, ఆడియో విజువల్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ప్లాంట్ కార్మికులను ఆప్యాయంగా పలకరించి, వారితో ముచ్చటించి సరదాగా సెల్ఫీలు దిగారు. అనంతరం లైన్ 2 విస్తరణ పనులకు భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**ప్లాంట్ విస్తరణ, సామర్థ్యం వివరాలు**

దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ ఈ ప్లాంట్ విస్తరణను అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.3,100 కోట్ల వ్యయంతో చేపట్టనుంది. ఈ విస్తరణతో ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. క్లింకర్ సామర్థ్యం: ప్రస్తుతం ఉన్న ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల నుండి 6.1 మిలియన్ టన్నులకు పెరగనుంది. సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం: ప్రస్తుతం ఉన్న ఏడాదికి 3.6 మిలియన్ టన్నుల నుండి ఏకంగా 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది.

**ఉపాధి కల్పన :**

ఈ విస్తరణ ద్వారా స్థానిక యువతకు పెద్ద పీట వేస్తూ కొత్తగా మరో 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

**హాజరైన ప్రముఖులు :**

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ సిహెచ్ భూపేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు. అలాగే దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్‌పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వరం

### పర్చూరు నియోజకవర్గంలో ఘనంగా 'థ్యాంక్యూ సీఎం సార్' కార్యక్రమం




**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జులై 15)**

2003 డీఎస్సీ ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై పర్చూరు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 వేల మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరిందని, ఇందుకోసం దాదాపు రూ.30 వేల కోట్ల పెన్షన్ భారం ప్రభుత్వం భరిస్తోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో బుధవారం 'థ్యాంక్యూ సీఎం సార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గానికి చెందిన సుమారు 100 మంది ఉపాధ్యాయులకు ఈ నిర్ణయం ద్వారా లబ్ధి చేకూరనుండగా, దాదాపు రూ.300 కోట్ల మేర పెన్షన్ ప్రయోజనం అందనున్నట్లు ఉపాధ్యాయ సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకుడు నూతలపాటి మార్కు మాట్లాడుతూ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల జీవితాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగు నింపారని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పాత పెన్షన్ హక్కును ప్రభుత్వం పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసుకుని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

**ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకం**

పాత పెన్షన్ విధానం అమలుతో భవిష్యత్ భద్రత కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందని, ఇది చరిత్రాత్మక నిర్ణయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్, నాగేశ్వరరావు, వాసుదేవరావు, రత్నకుమార్, రఘు, శ్రీనివాసరావు, కండిమళ్ల రవికుమార్, సునీల్, ఈశ్వర్ ప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులు నీ అంతు చూస్తామని బెదిరించటం ఎంతవరకు న్యాయం

### 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 15)**

కొమరోలు మండలం దద్దవాడ గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి కే రమణయ్య పై తెలుగుదేశం పార్టీ నాయకులు బెజ్జం రవీంద్రారెడ్డి మరో ఐదుగురు అనుచరులతో పంచాయితీ ఆఫీసు నందు రమణయ్యతో అసభ్యంగా ప్రవర్తిస్తూ బల్లలు పడవేసి తమ బిల్లులు వెంటనే చెల్లించాలని లేనియెడల నీ అంతు చూస్తామని బెదిరించటం ఎంతవరకు న్యాయమని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పంచాయతీ అభివృద్ధి అధికారి కే రమణయ్య పై దురుసుగా ప్రవర్తించిన రవి చంద్రారెడ్డి, అతని అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని, లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే పోలీస్ అధికారులతో చర్చించి నిందితులను వెంటనే అరెస్టు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేని ఎడల బీసీల వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుందని శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీల పై దాడులు అధికమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి దాడులను అరికట్టే విధంగా వెంటనే రక్షణ తీసుకురావాలని శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్ అందిస్తున్నాం

### పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి
### కూటమి పాలనలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం
### రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి విద్యుత్ ఛార్జీలు ట్రూ డౌన్ చేశాం
### మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి





**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 15)**

ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్ అందిస్తున్నామని, పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం ఎస్సీ కాలనీలో పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానల్స్ ని మంత్రి డిఎస్ బీవీ స్వామి, మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా.స్వామి మాట్లాడుతూ...ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు 40శాతం రాయితీతో సోలార్ ప్యానెళ్లను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ పథకం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్ను ఉత్పత్తి చేయొచ్చని, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించవచ్చని అన్నారు. అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్తుని ప్రభుత్వానికి అమ్మవచ్చన్నారు. ఈ పథకంతో భవిష్యత్లో విద్యుత్ కొరతకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కూటమి పాలనలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని, రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి విద్యుత్ ఛార్జీలు ట్రూ డౌన్ చేశామని మంత్రి స్వామి అన్నారు.

## వైసీపీ నాయకులే లక్ష్యంగా అక్రమ కేసులు

### ఉమ్మడి ప్రకాశం జిల్లా వైయస్సార్‌సిపి ప్రధాన కార్యదర్శి మూలే గోపాల్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 15)**

కనిగిరి పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నాయకులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు అక్రమ కేసులు బనాయించడాన్ని వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూలే గోపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై మండిపడ్డారు. గతంలో కనిగిరి పట్టణంలో జరిగిన ఒక నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారనే సాకుతో పోలీసులు కావాలనే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సదరు నిరసన కార్యక్రమం జరిగిన సమయంలో తాను కనీసం అక్కడ లేనప్పటికీ, తన పై కూడా ఉద్దేశపూర్వకంగానే కేసు కట్టారని గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

**న్యాయపరంగా పోరాడుతాం**

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాల ద్వారా మంచి చేశామని ఆయన గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కేవలం ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి బెదిరింపులు, అక్రమ కేసులకు తాము భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా వాటన్నింటినీ న్యాయపరంగానే ఎదుర్కొంటామని మూలే గోపాల్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఘనంగా దామచర్ల ఆంజనేయులు జయంతి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూలై 15)**

స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుధవారం మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 97వ జయంతి వేడుకలు మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ దామచర్ల ఆంజనేయులు, మండవ పుల్లయ్య విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేశారు. సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర మార్కెటింగ్ దేవాలయ శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన రైతుల అభ్యున్నతికి ఆలయాల పవిత్రత కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, పల్లపోతు ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, గెటబోయిన మల్లికార్జున, మోరు బోయిన మాల్యాద్రి, మన్నెం మల్లికార్జునరావు, దాసరి కృష్ణారావు, ఎర్ర నరేంద్ర, ఉన్నం శ్రీనివాసరావు, పల్లపోతు రమేష్ బాబు, అనుమోలు సుధాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## క్విస్ ఫార్మసీ కళాశాలలో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం

**సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహణ**
**క్విస్ ఫార్మసీ, కిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో**






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 15)

ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో ఒంగోలు మరియు కిమ్స్ హాస్పిటల్, ఒంగోలు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దాంట్లో భాగంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేశారు. క్విస్ ఫార్మసీ కళాశాలలోని ధన్వంతరి సెమినార్ హాల్ లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ ఆంకాలజీ నిపుణులు డాక్టర్ నారు రమణరెడ్డి (చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్), డాక్టర్ ముత్యాల హరి హేమంత్ (కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ ɑ హీమాటో–ఆంకాలజిస్ట్), డాక్టర్ ముత్యాల హరికిరణ్ (కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్) క్యాన్సర్ నివారణ, ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించడం, హెచ్చరిక లక్షణాలు, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు. క్యాన్సర్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరంలో మామోగ్రఫీ, ఎక్స్–రే, పాప్ స్మియర్, డయాబెటిస్, పరీక్ష, రక్తపోటు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి దేవి కిమ్స్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్విస్ కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు, ఫార్మసీ సిబ్బంది, కిమ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్ రావు సేవలు చిరస్మరణీయం

**జలహారతి కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు ఏలూరి, నక్కా**



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 15)

నీటిపారుదల రంగంలో పద్మభూషణ్ డాక్టర్ కెయల్ రావు అందించిన అమూల్యమైన సేవలు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభిప్రాయపడ్డారు. కేఎల్ రావు జయంతిని పురస్కరించుకుని మండలంలోని పవిత్ర సంగమం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కలిసి కేఎల్ రావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ వంటి బృహత్తర సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనలో డాక్టర్ కెయల్ రావు పోషించిన చారిత్రాత్మక పాత్రను గుర్తు చేసుకున్నారు. ఆయన దూరదృష్టి, అకుంఠిత దీక్ష ఫలితంగానే నేడు లక్షలాది ఎకరాల బీళ్లు సస్యశ్యామలంగా మారాయని కొనియాడారు. కరువు కాటకాలతో అల్లాడిన నేలలను సుభిక్షంగా తీర్చిదిద్దిన కేఎల్ రావు కృషి రైతాంగానికి వరప్రసాదమని అభివర్ణించారు. నేటి తరం ఇంజనీర్లు, పాలకులు ఆయన స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. 1902 జూలై 15న జన్మించిన డాక్టర్ కె యల్ రావు దేశంలోని అగ్రశ్రేణి నీటిపారుదల ఇంజనీర్లలో ఒకరిగా చరిత్రలో నిలిచారన్నారు. ఆయన స్మృత్యర్థం ప్రతి సంవత్సరం జూలై 15న జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు చిట్టిబాబు, ప్రజాప్రతినిధులు పాల్గొని కేఎల్ రావుకు నివాళులర్పించారు.

# భవిష్యత్ పై విశ్వాసానికి దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ నిదర్శనం

**ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్‌ది విలువైన భాగస్వామ్యం**
**పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం**
**నైపుణ్యాభివృద్ధిలో ఏపీకి సహకారం అందించండి**
**దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్**










(షణ్ముఖ వెలుగు, జమ్మలమడుగు, జులై 15)

ఏపీ పై విశ్వాసానికి దాల్మియా భారత్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ నిదర్శనం. ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్ ది విలువైన భాగస్వామ్యం అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ దాల్మియా సిమెంట్స్ కడప ప్లాంట్ లైన్ 2 విస్తరణకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమంలో మీ అందరితో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు కేవలం ఒక తయారీ యూనిట్ విస్తరణ గురించి మాత్రమే కాదు.. విశ్వాసాన్ని మరింత విస్తరించే రోజు. వ్యాపారంలో మొదటి పెట్టుబడి అవకాశాలపై నమ్మకంతో వస్తుంది. రెండో పెట్టుబడి అనుభవంపై నమ్మకంతో వస్తుంది. ఇప్పటికే ఉన్న ఒక సంస్థ తన కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించినప్పుడు అది గట్టి సందేశాన్ని ఇస్తుంది. రాష్ట్రంపై విశ్వాసం, పాలనపై విశ్వాసం, భవిష్యత్తుపై విశ్వాసం. ఈ రోజు దాల్మియా భారత్ చేపడుతున్న విస్తరణ కూడా అలాంటి విశ్వాసానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున మా రాష్ట్రంపై తమ నమ్మకాన్ని మరింత బలోపేతం చేసిన దాల్మియా భారత్ కుటుంబ సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**పునీత్ దాల్మియా జీవితం ఎంతో స్ఫూర్తిదాయకం**

పునీత్ జీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన ఐఐటీ ఢిల్లీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఐఐఎం బెంగళూరు నుంచి గోల్డ్ మెడల్ సాధించారు. నేడు దేశంలోని అత్యంత గౌరవనీయ పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా నిలిచారు. అయితే నన్ను మరింతగా ప్రేరేపించేది ఏమిటంటే.. భారతదేశంలోని తొలి డిజిటల్ స్టార్టప్‌లలో ఒకటైన జీఓఐబాజార్.ఎఐ సహస్థాపకులుగా వ్యవహరించడం. మీరు కేవలం ఒక వారసత్వాన్ని స్వీకరించలేదు. దానికి నాయకత్వం వహించే ముందు... మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును నిర్మించుకున్నారు. అదే ఔత్సాహిక పారిశ్రామిక స్ఫూర్తి ఈ రోజుకీ దాల్మియా భారత్‌ను ముందుకు నడిపిస్తోంది.

**మానవ వనరులే దేశానికి విలువైన సంపద**

ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా... మీ నాయకత్వంలోని ఒక అంశంతో ప్రత్యేక అనుబంధం ఉంది. మీరు భారతదేశంలోని అతిపెద్ద పారిశ్రామిక సంస్థల్లో ఒకదానికి నాయకత్వం వహిస్తున్నప్పటికీ... విద్యాభివృద్ధికి, విద్యా సంస్థల నిర్మాణానికి నిరంతరం అండగా నిలుస్తున్నారు. అశోక విశ్వవిద్యాలయంతో మీ అనుబంధం... భారతదేశానికి అత్యంత విలువైన సంపద సిమెంట్, ఉక్కు కాదు, మానవ వనరులేనని మీరు విశ్వసిస్తున్నారనే విషయాన్ని ప్రతిబింబిస్తోంది. అదే తత్వాన్ని మేం కూడా బలంగా విశ్వసిస్తున్నాం. ప్రభుత్వాలు ప్రతిభను తీర్చిదిద్దుతాయి. పరిశ్రమలు అవకాశాలను సృష్టిస్తాయి. రెండూ కలిసి భవిష్యత్తును నిర్మిస్తాయి.

**ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్ ది విలువైన భాగస్వామ్యం**

దాల్మియా భారత్ అనేక ఏళ్లుగా ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో భాగస్వామిగా ఉంది. ఈ రోజు జరుగుతున్న విస్తరణ మన భాగస్వామ్యానికి ఆరంభం కాదు.. ఇది పరస్పర విశ్వాసంతో కొనసాగుతున్న బంధానికి తదుపరి అధ్యాయం. రూ.3,100 కోట్ల ఈ విస్తరణ... ఏపీ పట్ల దాల్మియా భారత్‌కు ఉన్న దీర్ఘకాలిక నిబద్ధతకు నిదర్శనం. అలాగే ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. సస్టైనబిలిటీ, గ్రీన్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ, రెస్పాన్సిబుల్ గ్రోత్.. ఇవన్నీ మేం ఎంతో విలువైనవిగా భావించే సూత్రాలు.

స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ ఏపీ బలం

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు నిర్ణయాల్లో వేగం, విధానాల్లో స్థిరత్వం, పాలనలో సేవాభావాన్ని కోరుకుంటున్నారు. గౌరవ సీఎం చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి నాయకత్వంలో ఏపీ ఈ మూడు సూత్రాల ఆధారంగా పెట్టుబడులకు అనుకూలమైన పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తోంది. అందుకే ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను విస్తరిస్తున్నారు. కొత్త పెట్టుబడిదారులు కూడా ఏపీని తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు.

**సుస్థిరతే అభివృద్ధికి అతిపెద్ద ప్రేరణ**

ప్రపంచ దేశాలు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వైపు అడుగులు వేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తున్న కొద్దీ ఉక్కు, సిమెంట్, ఇంధనం, రవాణా వంటి రంగాలపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ మరింత పెరుగుతుంది.

**అత్యల్ప కర్బన ఉద్గారాలున్న సిమెంట్ తయారీ సంస్థల్లో దాల్మియా ఒకటి**

కర్బన ఉద్గారాలను తగ్గించడం అత్యంత క్లిష్టమైన పరిశ్రమల్లో సిమెంట్ రంగం అత్యంత సవాలుతో కూడుకున్నది. ప్రపంచంలో అత్యల్ప కర్బన ఉద్గారాలున్న సిమెంట్ తయారీ సంస్థల్లో దాల్మియా ఒకటి. 2040 నాటికి కార్బన్ న్యూట్రల్ సంస్థగా మారాలని సంకల్పించింది. పునరుత్పాదక ఇంధనం, ఇంధన సామర్థ్యం, విద్యుత్ ఆధారిత రవాణాలో తన నాయకత్వాన్ని చాటుతూ.. ప్రపంచంలోనే =జు100, జు100, జు.ఎ100 కార్యక్రమాల్లో సభ్యత్వం పొందిన తొలి సిమెంట్ సంస్థగా కూడా దాల్మియా భారత్ నిలిచింది. కడప ప్లాంట్ విస్తరణ కూడా ఈ విషయాన్ని ప్రతిబింబిస్తోంది. కార్యకలాపాల్లో 80 శాతం వరకు రెన్యూవబుల్ ఎనర్జీ, వేస్ట్ హీట్ రికవరీ, మున్సిపల్ వ్యర్థాల కో ప్రాసెసింగ్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్, విస్తృత స్థాయిలో వర్షపు నీటి సంరక్షణ, విద్యుత్ వాహనాల ఆధారిత లాజిస్టిక్స్, ఏఐ ఆధారిత కార్యాచరణ సామర్థ్యం, అత్యుత్తమ ఉద్గార నియంత్రణ వ్యవస్థలు వంటి అంశాలతో ఈ ప్లాంట్ భవిష్యత్తుకు సిద్ధమైన తయారీకి ఆదర్శంగా నిలుస్తోంది. ఇలాంటి పరిశ్రమలతో భాగస్వామ్యం వహించడం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో గర్వకారణం.

**కష్టాన్ని నమ్ముకున్న వాళ్లు కడప జిల్లా ప్రజలు**

జమ్మలమడుగు ఎప్పుడొచ్చినా జోష్ అదిరిపోతుంది. కడప జిల్లా ప్రజలు అనగానే నాకు గుర్తొచ్చేది కష్టం. కష్టాన్ని నమ్ముకున్న వాళ్లు కడప జిల్లా ప్రజలు. ఎవరి నుంచి సహాయం ఆశించరు. ఇక్కడి కార్మికులు, రైతులు ఆంధ్రప్రదేశ్ కి బ్రాండ్ అంబాసిడర్లు. ఇక్కడ రైతులు పిల్లల భవిష్యత్ కోసం భూములు త్యాగం చేశారు. మీ పిల్లలు కంపెనీలో కష్టపడి పనిచేసి మంచి పేరు తీసుకొచ్చారు. మేం అనుమతులు ఇవ్వగలం కానీ కంపెనీకి నమ్మకం మీ వలనే వస్తుంది. మీరు ఆ నమ్మకాన్ని ఇచ్చారు.

దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి

మన ముఖ్యమంత్రి చంద్రబాబు, మన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, తాను అన్ని దేశాలు తిరుగుతూ ఏపీని ప్రమోట్ చేస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని అడుగుతున్నాం. నేను యువగళం పాదయాత్రలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం కోసం కష్టపడుతున్నాం. రెండేళ్లలోనే అనేక పెద్ద కంపెనీలు ఏపీకి తీసుకువచ్చాం. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చాయి. కొత్త కంపెనీలు తీసుకురావడం ఎంత ముఖ్యమో.. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన కంపెనీలను కూడా మనకి అంతే ముఖ్యం. నేను కొత్త వాళ్లను కన్విన్స్ చేయడంతో పాటు మనదగ్గర ఉన్న కంపెనీలతో ఎక్స్ పాన్షన్ చేయించాలి. అప్పుడే మనం సక్సెస్ అవుతాం.

**రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన వాళ్లకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**

మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన వాళ్లకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అందుకే వేరే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రిక్వెస్టులు వస్తున్నా వాళ్లు మాత్రం ఏపీనే ఎంచుకుంటున్నారు. ఈ రోజు దాల్మియా సిమెంట్స్ విస్తరణ జరగడానికి ప్రధాన కారణం ఇక్కడి రైతులు, కంపెనీని నడిపిస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, కార్మికులు. మీ అందరికీ అభినందనలు. కడప జిల్లా భవిష్యత్ కు మరో బలమైన పునాది వేశాం. నేను ప్రపంచం మొత్తం తిరిగి కంపెనీలు తీసుకొస్తాను. అది నా బాధ్యత. కానీ ఆ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చిన యువతపై కూడా బాధ్యత ఉంటుంది. మీ క్రమశిక్షణ, శ్రమించే తత్వం, మీ వ్యక్తిత్వం వల్ల మనకి మంచి పేరు వస్తుంది. మీరంతా కష్టపడి పనిచేస్తే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి.

పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం

నాకొక వింత పరిస్థితి ఉంది. మేం కంపెనీ పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం.. మీ దగ్గర నిపుణులైన యువత ఉన్నారా అని కొంతమంది అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటీఐలను పరిశ్రమలతో అనుసంధానిస్తున్నాం. ఒక్కో ఐటీఐ ఒక్కో కంపెనీకి అనుసంధానించాం. పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం. మొన్న శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించాం. అది ఇండియాలోనే ఫస్ట్ ఎల్‌ఈజీలెర్న్, ఎర్న్, గ్రాడ్యుయేట్ మోడల్ యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్ రూమ్ లో, 8 నెలలు ఇండస్ట్రీలో వర్క్ చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన అన్ని నైపుణ్యాలు వారికి ఉంటాయి.

**నైపుణ్యాభివృద్ధిలో ఏపీకి సహకారం అందించండి**

ప్రపంచ స్థాయి నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను నిర్మించే మా ప్రయత్నంలో ఏపీ ప్రభుత్వానికి భాగస్వామిగా నిలవాలని పునీత్ జీని కోరుతున్నా. మా యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో మాకు సహకరించండి. నైపుణ్యాభివృద్ధిలో ఏపీని దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మాతో కలిసి పనిచేయండి. అశోక విశ్వవిద్యాలయం తరహాలో ఉన్నత విద్యను ప్రోత్సహించే మరో ప్రపంచస్థాయి విద్యాసంస్థను ఏపీలో ఏర్పాటు చేయడాన్ని కూడా మీరు పరిశీలిస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది.

**ఏపీని రెండో ఇల్లుగా భావించండి**

ఒక వ్యాపారవేత్తగా మీ ఔత్సాహిక పారిశ్రామిక ప్రయాణం పట్ల, అలాగే మీరు భవిష్యత్తులో ప్రారంభించబోయే కొత్త వ్యాపారాల పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను మీ రెండో ఇల్లుగా భావించండి. మీరు ఏ కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నా ముందుగా మాకోసారి ఫోన్ చేయండి. మీకు అత్యుత్తమ వేదికను, అత్యంత ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను, అనుకూలమైన విధానాలను అందిస్తాం. మీతో మేం పోటీ పడేది ఒక్క విషయంలోనే... వేగంలో. నా దృష్టిలో ఇది కేవలం ఒక సిమెంట్ ప్లాంట్ విస్తరణ మాత్రమే కాదు... దాల్మియా గ్రూప్‌తో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఘట్టం.

**అభివృద్ధిలో దాల్మియా భాగం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 దార్శనికత, మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర–2047 దార్శనిక మార్గదర్శకత్వంలో, దాల్మియా భారత్ ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో విలువైన భాగస్వామిగా నిరంతరం కొనసాగుతుందని పూర్తి విశ్వాసం ఉందని లోకేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్జున్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత, జమ్మలమడుగు నియోజకవర్గ ఎమ్మెల్యే సీ.ఆదినారాయణ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ సీహెచ్ భూపేష్‌రెడ్డి, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ పి శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## జులై 17 కారంచేడు మారణకాండ దినాన్ని హక్కుల పోరాట దినంగా జరుపుకుందాం

### దళిత నేత నీలం నాగేంద్రరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 15)**

కారంచేడు మాదిగ పల్లి పై కమ్మ కుల నరహంతకులు దాడి జరిగి 41 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా జూలై 17 హక్కుల పోరాట దినముగా జరుపుకుందామని దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర పిలుపునిచ్చారు బుధవారం స్థానిక దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడాతు భారతదేశంలో 1985 ముందు అనేక దమనకాండలు దళితులపై జరిగినప్పటికీ కారంచేడు ఘటన దేశంలోని అగ్రకుల పార్టీల పునాదులను కదిలించి దళితులకు ప్రత్యేక హక్కులు చట్టాలను తెచ్చిపెట్టిందని గుర్తు చేశారు. కుల గుర్తింపును నిరాకరించిన కమ్యూనిస్టులు నక్సలైట్ పార్టీలు సైతం కుల నిర్మూలన పోరాట సమితి లు ఏర్పాటు చేసుకునే స్థితికి తీసుకువచ్చాయని అన్నారు. అగ్రకుల రాజకీయ పార్టీ తమ పార్టీకి అనుబంధంగా ఎస్సీ సెల్ లను ఏర్పాటు చేసుకోవలసిన స్థితి కల్పించాలని అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఎజెండాని భారత దేశ జెండాగా మార్చిన దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాట పొలికేక కారంచేడు ఉద్యమం అని అన్నారు. దళితుల ఐక్యతను అగ్రకుల రాజకీయ పార్టీ లు అధికారాన్ని ఉపయోగించుకొని విజయం సాధించేయని అన్నారు. కారంచేడు చుండూరు పోరాటాల ఫలితంగా భారతదేశంలో దళితుల హక్కుల కోసం వచ్చిన ఎస్సీ ఎస్టీ చట్టానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పడుతున్నాయని అన్నారు. దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సంక్షేమ పథకాలను అగ్రకుల రాజకీయ పార్టీలు నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయకుండా ఈ డబ్ల్యూ ఎస్ పేరుతో దళితులకు అన్యాయం చేసాయి అని, మాల మాదిగ రెల్లి కార్పొరేషన్ లకు నిధులు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేసి కమ్మ కాపు వైశ్య బ్రాహ్మణ కార్పొరేషన్ లకు వేల కోట్లు కైంకర్యం చేస్తున్నారని అన్నారు. అందుకే జూలై 17 కారంచేడు ఘటన జరిగి 41 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ఈ స్ఫూర్తితో దళితులు కోల్పోయిన హక్కులను తిరిగి సాధించుకునేందుకు దళిత బహుజన సంఘాలు పునర్ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, డిబిఎఫ్ రాష్ట్ర నాయకులు మేళం భాగ్యరావు, దళిత మహాసభ నాయకులు, మాచవరపు జూలియన్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును ఆక్రమించిన చెట్లు ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న పుల్లలచెరువు-గారపెంట రహదారి





**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 15)**

పుల్లలచెరువు నుంచి గారపెంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లు, పొదలు అధికంగా పెరిగి రోడ్డుపైకి విస్తరించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ పొలం పనులకు వెళ్లే మహిళలు, రైతులు, వృద్ధులు, ఉద్యోగులు, అలాగే గారపెంట గ్రామం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో కూడిన స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానికొకటి దారి ఇచ్చుకోవడం కష్టంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరియు వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. "ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ప్రమాదం జరగకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం ఎంతో ఉత్తమం" అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో మరియు సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రత కోసం ముందస్తు చర్యలే శాశ్వత పరిష్కారం. అధికారులు త్వరితగతిన స్పందించి ఈ సమస్యను పరిష్కరిస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కంభంలో చిత్రకళాకారుల ఆత్మీయ సమ్మేళనం

### మిత్ర ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

### సీనియర్ చిత్రకారులకు ఘన సన్మానం





**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 15)**

మిత్ర ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కంభంలోని శ్రీ రామచంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో బుధవారం చిత్రకారుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 మంది చిత్రకారులు పాల్గొన్నారు. సమావేశంలో సంఘ అభివృద్ధి, కమిటీ విధి విధానాలు, సభ్యుల మధ్య పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరంపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గిద్దలూరుకు చెందిన సీనియర్ చిత్రకారులు నజీర్, టి.వి.ఎస్., మార్కాపురానికి చెందిన సురేష్, బాషా, కందులపురానికి చెందిన శామ్, కమిటీ అధ్యక్షుడు బి. శేఖర్, అలాగే శ్రీ రామచంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత పోతిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. విరామ సమయంలో కళాకారులు నిర్వహించిన పాటల కచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రకారులు రూపొందించిన పలు చిత్రాలను ప్రదర్శించగా, అవి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నూతన కార్యవర్గం ఇదే....అధ్యక్షుడు బి శేఖర్ (గిద్దలూరు), ఉపాధ్యక్షుడు ఎ కోటి (నాగిరెడ్డిపల్లి), కార్యదర్శి బుద్ధుల బాబు (బెస్తవారిపేట), సంయుక్త కార్యదర్శి జోబ్ (సోమవారిపేట), కోశాధికారి ఇ వెంకట్ (కంభం), కార్యవర్గ సభ్యులు రాంబాబు (యర్రగొండపాలెం), జివిఆర్ (కంభం), గౌరవ సలహాదారులు సురేష్ (మార్కాపురం), బాషా (మార్కాపురం), నజీర్ (గిద్దలూరు), టివిఎస్ (గిద్దలూరు), ముఖ్య కార్యవర్గ సభ్యులు పాఠాన్ ఖాశిం (కంభం), ఎం రాజశేఖర రాజు (కంభం) ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కంభం ఎన్జీఓల రిటైర్డ్ సభ్యులు శ్రీ పాడు, శ్రీ కలాం హాజరై చిత్రకారులను అభినందించారు. చిత్రకళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో కళాకారుల ఐక్యతే సంఘ బలమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.





# కడప జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటన

### దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

### విద్యార్థుల అభ్యసన ఫలితాల పై ఆరా

**(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, జులై 15)**







కడప జిల్లాలో పర్యటించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

**నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది**

మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలుచేస్తోందని వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రులు ఫీడ్ బ్యాక్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి నారా లోకేష్ కు వివరించారు.

**లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టి పెట్టాలి**

పాఠశాల తనిఖీ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మంత్రి ఆరా తీశారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో పాఠశాల 1.3 స్టార్ రేటింగ్ పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ధనలక్ష్మిని మంత్రి ప్రశ్నించారు. ఫార్మాటివ్, సమ్మేటివ్ అసెస్ మెంట్ పై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన పాఠశాలల పట్ల ఎంఈవోలు దృష్టిపెట్టాలని, 15 రోజులకోసారి సమీక్ష చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. హాజరుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరయ్యే పరిస్థితిని నివారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ గతేడాది కంటే తక్కువగా ఉండటంపై మంత్రి ఆరా తీశారు. 10 మంది విద్యార్థులు వసతిగృహాలకు, కేజీబీవీలకు తరలివెళ్లడం వల్ల ఎన్ రోల్ మెంట్ తగ్గిందని ప్రిన్సిపాల్ వివరించారు. గతేడాది కంటే అడకమిక్ ఫెర్ఫార్మెన్స్ మెరుగుపడటం పట్ల మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యమని, అందరం కలిసికట్టుగా ఉంటేనే ఇది సాధ్యమని చెప్పారు. విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పై దృష్టిపెట్టాలని.. ముఖ్యంగా విద్యార్థినులు డ్రాప్ అవుట్స్ కాకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో వచ్చే ఏడాదికి 4 స్టార్ రేటింగ్ సాధిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు.

## దివ్యాంగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 21న భారీ దివ్యాంగజన్ జాబ్ మేళా

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 15)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో దివ్యాంగజన్ జాబ్ మేళాను 2026 జూలై 21వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మార్కాపురంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొంటున్నాయి. ఈ జాబ్ మేళాకు ౧౦వ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ మరియు అంతకంటే పై అర్హతలు కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చు. ఉద్యోగాల ప్రకారం నెలకు రూ.12,000 నుంచి రూ.32,000 వరకు వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు ఆంధ్రప్రదేశ్‌తో పాటు బెంగళూరు, చెన్నై, హోసూరు, మైసూరు, తిరుపతి, శ్రీ సిటీ తదితర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ జాబ్ మేళాలో చెవిటి , మూగ-చెవిటి , స్వల్ప లోకోమోటర్ ,లోకోమోటర్ దివ్యాంగులకు అనువైన ఉద్యోగ అవకాశాలు కల్పించబడు తున్నాయి. మొత్తం 330 దివ్యాంగుల ఖాళీలు మరియు 130 సాధారణ అభ్యర్థులకు కూడా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 7013950097, 8008822821, 9912438757 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## గంగపాలెం, నర్సాయపాలెం గ్రామాలలో గ్రామసభలు



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 15)**

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు మండలంలోని గంగపాలెం, నర్సాయపాలెం గ్రామాలలో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ముందుగా మండల వ్యవసాయ అధికారి కే నీరజ మాట్లాడుతూ గ్రామాలలో సాగుచేసిన పంటల వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో వలన కరువు ఏర్పడే పరిస్థితి ఉంది. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే నీటి ఎద్దడిని తట్టుకొనే స్వల్ప కాలిక రకాలైన అపరాలు, తృణ ధాన్యాలు సాగుచేయాలని సూచించారు. రైతులు మిరప, మొక్క జొన్న సాగు తగ్గించుకోవలసినదిగా తెలియజేశారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలి అని తెలిపారు. రైతులకు కావలసిన యూరియా, డిఏపి ఎరువులను రైతు సేవ కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ కూడా యూరియా కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని తెలియజేశారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి శరత్ మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం గురించి రైతులకు వివరించారు.పంట సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా పంటల భీమా చేపించుకోవాల్సిందిగా కోరారు. వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం కింద ప్రత్తి పంట కు ఎకరాకు రూ.2,100లు ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో మిరప పంటకు ఎకరానికి రూ.2,700లు, మినుము పంటకు ఎకరాకు రూ.200లు చెల్లించవలసి ఉంటుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించవలసిన చివరి తేదీ జూలై 31 అని తెలియజేశారు. రైతు సోదరులు రైతు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్కు, రైతు స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకొని దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్‌లో పంటల బీమా చెల్లించవలసి ఉంటుంది అని తెలియజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటి నుండి 10 సంవత్సరాలు ఎర్రగొండపాలెంలోని అన్ని గ్రామాలలో తమ సంస్థ ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం మరియు వారికి కావలసిన ఇన్పుట్స్ అందిస్తామని తెలియచేశారు. అనంతరం రైతులు సాగు చేసిన ప్రత్తి పంటను పరిశీలించారు. బెట్ట పరిస్థితిని అధిగమించడానికి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి పై అవగాహన



**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 15)**

మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె మధుర వాణి ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అందరితో ప్రతిజ్ఞ చేయించి డెంగ్యూ వ్యాధి యొక్క లక్షణాలు తెలియజేసి, జ్వర పీడిత బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని తెలియచేశారు. కంభం సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టెల్లో నీరు నిలువ ఉంచుకోకూడదని, పాత టైర్లలో, పారేసిన కొబ్బరి బొండాల్లో నీరు ఉంచడం చేయకూడదని అవి పారేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంభం సబ్ యూనిట్ అధికారి జి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, స్కూల్ సిబ్బంది అమృతవల్లి, వరమ్మ, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించిన సీఎం చంద్రబాబు

### పట్టి సీమ'ను 'గట్టి సీమ' గా నిరూపించారు
### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 15)**
పర్చూరు నియోజకవర్గానికి పట్టిసీమ ప్రాజెక్టు వరప్రదాయినిగా మారిందని, ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అయ్యాయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. జల హారతి కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద బుధవారం ఘనంగా జల హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై, గోదావరి-కృష్ణా నదుల సంగమానికి జల హారతి ఇచ్చారు.

**సీతానగరం వద్ద నీటి విడుదల**

ఇందుకు ముందు గుంటూరు జిల్లా సీతానగరం వద్ద కృష్ణా పశ్చిమ డెల్టా తాగునీటి అవసరాల నిమిత్తం మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌లతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నీటిని విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు రప్పించి, పట్టిసీమ 'వట్టి సీమ' కాదని... 'గట్టి సీమ' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరూపించారని ఆయన కొనియాడారు. సీఎం ముందుచూపు, ఆయన పాలనా దక్షత దక్షిణాంధ్ర ప్రజల కోసమేనని పేర్కొన్నారు. ప్రజల తాగునీటి ఇబ్బందులను తొలగించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌లతో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పై దాడులు దుర్మార్గం

### బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా హరి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 15)**
కొమరోలు మండలం దద్దవాడ గ్రామ పంచాయతీ పరిధిలో విధుల్లో ఉన్న పంచాయతీ అభివృద్ధి అధికారి కే రమణయ్య పై స్థానిక నాయకులుగా చలామణి అవుతున్న కొందరు వ్యక్తులు కార్యాలయంలో చొరబడి, దుర్భాషలాడుతూ భౌతిక దాడికి యత్నించడాన్ని బీసీవై పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా హరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ విధులను నిర్వహిస్తున్న అధికారిని బెదిరించడం, కార్యాలయ సామాగ్రిని పాడుచేస్తూ, అనాగరికంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. చల్లా హరి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఎమ్మెల్యే వచ్చే గురువారం నాడు బిల్లుల అంశం పై మాట్లాడతారని, అప్పటి వరకు సహకరించాలని అధికారి రమణయ్య అడిగినప్పటికీ విచక్షణ కోల్పోయి విధులకు ఆటంకం కలిగించడం దుర్మార్గం. ఇలాంటి ఘటనల వల్ల ప్రభుత్వ అధికారులు ప్రశాంతంగా విధులు నిర్వహించలేని భయానక వాతావరణం ఏర్పడుతుంది.

**తక్షణ చర్యలకు డిమాండ్ :**
దాడికి యత్నించిన సదరు వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 186, 189, 353 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చల్లా హరి పోలీసు శాఖను డిమాండ్ చేశారు. బాధిత అధికారికి బీసీవై పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని, ప్రభుత్వ ఉద్యోగుల రక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## కోడి పందేల పై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

### పోలీసుల అదుపులో 17 మంది పందేల రాయుళ్ళు
### మూడు కోళ్లు, 16 సెల్ ఫోన్లు స్వాధీనం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 15)**
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ చెంచయ్య, ఏ ఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమ కోడి పందేల నిర్వహణ పై ఒంగోలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఒంగోలు రూరల్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దిరాలపాడు గ్రామ పొలాల్లో నిర్వహించిన దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న 17 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 3 కోళ్ళు, 16 సెల్ ఫోన్లు, 3 మోటర్ సైకిళ్ళు, రూ.50,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. వారిని చర్యల నిమిత్తం ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగింది.

# పోర్టుల అభివృద్ధే మా లక్ష్యం ప్రైవేటీకరణ కాదు

### రామాయపట్నం పోర్టుపై వైసీపీ అసత్య ప్రచారాలు
### పీపీపీ విధానం ద్వారా పారదర్శకంగా, వేగంగా పోర్టు అభివృద్ధి
### ఈ డిసెంబర్ నాటికి పోర్టు నిర్మాణం పూర్తి
### వైసీపీ హయాంలో 50 శాతమే పనులు పూర్తయ్యాయి
### అభివృద్ధి కనిపిస్తే...వారికి కడుపు మంట
### ఆర్అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి విమర్శలు
### మంత్రితో కలిసి మీడియా సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 15)**



పోర్టుల అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పన అనే లక్ష్యాలతో అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానం పై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేయడం అత్యంత దురదృష్టకరమని రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేకించి రామాయపట్నం పోర్టును ప్రైవేటుకు అప్పగిస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తున్నారని వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల్లో అపోహలు, భయాందోళనలు సృష్టించడం తప్ప దీనిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు, ప్రభుత్వ ఆస్తులు, హక్కులను వదులుకోవడం కాదు. ప్రభుత్వ యాజమాన్యంలో మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్వహించడం. ఈ విధానంలో పోర్టు యాజమాన్యం, భూమి, సముద్రతీర హక్కులు, భద్రత, విధాన నిర్ణయాలు, టారిఫ్‌లు, చట్టబద్ధ నియంత్రణలు, పర్యావరణ ప్రమాణాలు సహా అన్ని కీలక అధికారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. ప్రైవేట్ భాగస్వామి ప్రభుత్వ నిర్దేశించిన షరతులకు లోబడి నిర్వహణ బాధ్యతలను మాత్రమే నిర్వహిస్తారు. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అధికారం, అవసరమైతే ఒప్పందాన్ని రద్దుచేసే పూర్తి హక్కు కూడా ప్రభుత్వానికే ఉంటుంది. దేశంలోని విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, మెట్రో రైలు వ్యవస్థలు, పారిశ్రామిక పార్కులు, ప్రధాన పోర్టులు సహా అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు పీపీపీ విధానంలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. పోర్టు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్‌లు, ఎగుమతి కేంద్రాలు అభివృద్ధి చెందుతాయి. స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జగన్ ప్రభుత్వంలో పోర్టు పనులు పూర్తయింది నిర్మాణం 50 శాతమే. కూటమి ప్రభుత్వంలో 30 శాతం పైగా పనులను పూర్తి చేసాం. గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశాం. పీపీపీ విధానంతో ప్రైవేట్ నిర్వాహకులు 1,500 కోట్ల రూపాయల ముందస్తు ప్రీమియాన్ని రెండు విడతలుగా ప్రభుత్వానికి చెల్లిస్తారు. అదనంగా, వేలంలో కోట్ చేసిన ఆదాయ వాటా ప్రభుత్వానికి లభించడంతో పాటు, 20వ సంవత్సరం నుంచి ప్రతి మూడు సంవత్సరాలకు ఆ వాటా 1 శాతం చొప్పున పెరుగుతూ గరిష్టంగా 25 శాతానికి చేరుతుంది. అలాగే, కనీస హామీ ఆదాయం కింద పోర్టు నిర్వాహకులు ప్రతి ఏడాది కనీసం రూ.10 కోట్ల నుంచి ప్రారంభమై కాలక్రమేణా రూ.150 కోట్ల వరకు ప్రభుత్వానికి తప్పనిసరిగా చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించాం. రామాయపట్నం పోర్టు ప్రాజెక్టులో రాష్ట్ర మారిటైమ్ బోర్డు అన్ని దశల్లోనూ, మొత్తం 19 బెర్తులపై 12 శాతం నాన్-డైల్యూటబుల్ ఈక్విటీ వాటాను శాశ్వతంగా కొనసాగిస్తుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ వాటా తగ్గదు. భూమిని ప్రైవేట్ సంస్థకు విక్రయించడం కాకుండా లీజు ప్రాతిపదికన మాత్రమే వినియోగ హక్కులు కల్పిస్తున్నాం. గంగవరం పోర్టులో రాష్ట్రానికి ఉన్న 10.4 శాతం వాటాను అదానీ గ్రూప్‌కు విక్రయించింది అప్పటి వైసీపీ ప్రభుత్వమే కాదా? అలాగే 2023లో జీఎంఆర్‌కు రెండు బెర్తులను ఏ ప్రాతిపదికన కేటాయించారు? ఈ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పిన తర్వాతే ప్రభుత్వంపై విమర్శలు చేస్తే బాగుంటుంది.పీపీపీ విధానం వైసీపీకి సమస్య కాదు. రాష్ట్ర అభివృద్ధే అసలు సమస్య. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు రావడం వారికి ఇష్టం లేదు. ప్రభుత్వ ఆదాయం పెరగడం ఇష్టం లేదు. ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై అసత్య ప్రచారం చేయడం, ప్రజలను భయపెట్టడం, పెట్టుబడిదారులను నిరుత్సాహపరచడం వైసీపీ రాజకీయ అజెండాగా మారింది. 2026 డిసెంబర్ నాటికి రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయడమే తమ లక్ష్యం. పోర్టును ప్రపంచస్థాయి ఆల్-వెదర్, మల్టీ-కార్గో పోర్టుగా అభివృద్ధి చేస్తాం. 2,538.42 ఎకరాల్లో, 19 బెర్తులతో, 138.54 ఎంటీపీఏ సామర్థ్యంతో అభివృద్ధి చెందుతున్న రామాయపట్నం పోర్టు ద్వారా సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు, 25 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

---

# విలువలతో కూడిన రాజకీయాన్ని గడిపిన వ్యక్తి స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు

### రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం,
### సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 15)**
విలువలతో కూడిన రాజకీయాన్ని గడిపిన వ్యక్తి కీర్తి శేషులు దామచర్ల ఆంజనేయులు అని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మాజీ మంత్రి ఆదర్శప్రాయుడు దామచర్ల ఆంజనేయులు 97 వ జయంతి సందర్భంగా అద్దంకి బస్టాండ్ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు పర్యాయాలు మంత్రులుగా పనిచేసి ఒంగోలు లో మార్కెట్ నిర్మించడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినటువంటి వ్యక్తి దామచర్ల ఆంజనేయులు అని కొనియాడారు. ఎన్టీ రామారావు దగ్గర నుండి అందరం కలిసి పనిచేశాము,అలాంటి రాజకీయ వారసులుగా నేడు ఆయన స్ఫూర్తిని తీసుకొని పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పిస్తున్నామని తెలిపారు. దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ప్రజా నేతగా సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండి తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకులు మా పెద్దాయన ఆంజనేయులుని నిరంతర ప్రజాసేవ కోసం పరితపించేవారు పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేశారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ వేడుకల్లో పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, జిల్లా అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, బిఎన్ విజయ్ కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శి ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతా రామయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, టిడిపి కార్యాలయంలో కూడా పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.





## ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్ డే కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 15)**
ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవన్ని మండలంలోని చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం ప్రాముఖ్యత మరియు ఉపయోగం విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాలలో ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్స్ కృష్ణా నాయక్, నాగయ్య ఈ దినోత్సవం సందర్భంగా క్విజ్ పోటీలు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ,తృతీయ బహుమతులను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు కుమార్, నరసింహారావు, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, అంకమ్మ, కృష్ణారావు, సుధాకర్ తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల పై తీర్మానం




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 15)**
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సూచనలతో యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సమావేశంలో టీడీపీ నాయకులు పాల్గొని మండలంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, సర్, పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాల పై చర్చించి పార్టీ తీర్మానాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్ర నాయక్, సత్యనారాయణ గౌడ్, తోట మహేష్ నాయుడు, వేగినాటి శీను, పాలడుగు వెంకట కోటయ్య, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టా పోలమ్మకి నివాళులర్పించిన మంత్రి నారా లోకేష్







**(షణ్ముఖ వెలుగు, ప్రొద్దుటూరు, జులై 15)**
ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి, స్వర్గీయ పుట్టా పోలమ్మ చిత్రపటానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ప్రొద్దుటూరులోని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నివాసానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితతో కలిసి స్వర్గీయ పుట్టా పోలమ్మ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాద సమయంలో వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ స్వర్గీయ పుట్టా పోలమ్మ కుటుంబ విలువలు, సేవాభావం, నిరాడంబర జీవన విధానం, మానవీయతకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె ఆదర్శాలు, విలువలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, లింగారెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రామ భూపాల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని స్వర్గీయ పుట్టా పోలమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.